తరంగాలు

రిపోర్టర్లు కావలెను

అతి తక్కువ కాలంలో తెలుగు రాష్ట్రాల్లో అత్యంత ప్రజాదరణ పొందుతున్న 'తరంగాలు' జాతీయ దినపత్రిక నందు పనిచేయుటకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని జిల్లాలోని అన్ని మండలాల నుండి రిపోర్టర్లు కావలెను.

సంప్రదించండి...

ఎడిటర్: గడ్డం నాగరాజు గౌడ్

94949 23460



https://epaper.tharangalu.in

RNI. TELTEL / 2022 / 83463

జాతీయ దిన ప్రతిక

# తరంగాలు

Tharangalu Daily News Paper

ప్రతి అక్షరం.... సామాన్యుడి అస్త్రం...

హైదరాబాద్

మంగళవారం

04 ఆగస్టు 2026

సంపుటి 03

సంచిక 295

పేజీలు 8

వెల రూ.5.00

Published From : Hyderabad,Circulated:Telangana,Andhrapradesh

Epaper: www.tharangalu.in.com




తరంగాలు
రిపోర్టర్లు కావలెను
అతి తక్కువ కాలంలో తెలుగు రాష్ట్రాల్లో అత్యంత ప్రజాదరణ పొందుతున్న 'తరంగాలు' జాతీయ దినపత్రిక నందు పనిచేయుటకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని జిల్లాలోని అన్ని మండలాల నుండి రిపోర్టర్లు కావలెను.
సంప్రదించండి...
ఎడిటర్: గడ్డం నాగరాజు గౌడ్
94949 23460

https://epaper.tharangalu.in
RNI. TELTEL / 2022 / 83463
జాతీయ దిన ప్రతిక
# తరంగాలు
Tharangalu Daily News Paper
ప్రతి అక్షరం.... సామాన్యుడి అస్త్రం...

హైదరాబాద్
మంగళవారం
04 ఆగస్టు 2026
సంపుటి 03
సంచిక 295
పేజీలు 8
వెల రూ.5.00

Published From : Hyderabad,Circulated:Telangana,Andhrapradesh
Epaper: www.tharangalu.in.com

## నిమ్స్ వైద్య బృందానికి సీఎం అభినందనలు



- వెయ్యి రోబోటిక్ శస్త్రచికిత్సల మైలురాయిపై రేవంత్ రెడ్డి హర్షం
- ప్రభుత్వ వైద్యంలో అత్యాధునిక సేవలు అందుబాటులోకి వచ్చాయని వ్యాఖ్య
- 90 శాతానికి పైగా ఉచిత శస్త్రచికిత్సలు నిర్వహించడంపై ప్రశంసలు
- మరిన్ని వైద్య విజయాలు సాధించాలని ఆకాంక్ష

హైదరాబాద్, ఆగస్టు 3 : హైదరాబాద్‌లోని నిజాం వైద్య విజ్ఞాన సంస్థ (నిమ్స్) రెండున్నరేళ్లలో వెయ్యి రోబోటిక్ శస్త్రచికిత్సలను విజయవంతంగా పూర్తి చేసిన సందర్భంగా ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ ఘనత సాధించిన నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ రాహుల్ దేవరాజ్‌తో పాటు వైద్యులు, నర్సింగ్ సిబ్బంది, ఆపరేషన్ థియేటర్ బృందం, ఇతర సిబ్బందికి ముఖ్యమంత్రి అభినందనలు తెలిపారు. ప్రజారోగ్య రంగంలో ఇది తెలంగాణకు గర్వకారణమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, ప్రభుత్వ ఆసుపత్రుల్లో అత్యాధునిక వైద్య సేవలను సామాన్య ప్రజలకు అందుబాటులోకి

మిగతా 2వ పేజీలో..



## నిమ్స్‌లో వెయ్యో రోబోటిక్ శస్త్రచికిత్స

- మూడేళ్లలోనే మైలురాయి చేరిన నిమ్స్
- 90 శాతానికి పైగా శస్త్రచికిత్సలు ఉచితంగా నిర్వహణ
- రోగులకు అత్యాధునిక వైద్య సేవల్లో మరో ఘనత
- జాతీయ స్థాయి అత్యుత్తమ కేంద్రంగా నిమ్స్ గుర్తింపు

హైదరాబాద్, ఆగస్టు 3 హైదరాబాద్‌లోని నిజాం వైద్య విజ్ఞాన సంస్థ (నిమ్స్) మూడేళ్లలోపే వెయ్యి రోబోటిక్ సహాయక శస్త్రచికిత్సలను విజయవంతంగా పూర్తి చేసి ప్రజారోగ్య రంగంలో అరుదైన మైలురాయిని అధిగమించింది. అత్యాధునిక రోబోటిక్ సాంకేతికతను ప్రభుత్వ వైద్య సేవల్లో అందుబాటులోకి తీసుకువస్తూ ప్రపంచ స్థాయి వైద్యాన్ని సామాన్య ప్రజలకు చేరువ చేయడంలో నిమ్స్ మరోసారి తన ప్రత్యేకతను చాటుకుంది. ఈ విజయంతో దేశంలోనే అత్యాధునిక రోబోటిక్ శస్త్రచికిత్సలు నిర్వహిస్తున్న ప్రముఖ ప్రభుత్వ వైద్య సంస్థల్లో నిమ్స్ ఒకటిగా నిలిచింది. రోబోటిక్ శస్త్రచికిత్సల ద్వారా శస్త్రచికిత్సల్లో ఖచ్చితత్వం పెరగడంతో పాటు రక్తస్రావం తగ్గడం, శస్త్రచికిత్స అనంతర నొప్పి తగ్గడం, ఆస్పత్రిలో ఉండే

మిగతా 2వ పేజీలో..

# పాదచారుల భద్రతే ప్రాధాన్యం

- పాదచారుల భద్రతపై సుప్రీంకోర్టు ఆదేశాలు
- ప్రతి రహదారిపై ప్రత్యేక మార్గం ఏర్పాటు చేయాలి
- ఫుట్‌పాత్‌లు ఆక్రమణలకు గురికాకుండా చర్యలు తీసుకోవాలి
- రెండు వారాల్లో కార్యాచరణపై కేంద్రానికి గడువు
- పాదచారుల హక్కు రాజ్యాంగబద్ధమైనదని మరోసారి స్పష్టం



న్యూఢిల్లీ, ఆగస్టు 3 దేశంలోని ప్రతి రహదారిపై పాదచారులు సురక్షితంగా నడిచేందుకు ప్రత్యేక స్థలాన్ని ఏర్పాటు చేయాలని సుప్రీంకోర్టు కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. పాదచారుల కోసం కేటాయించిన మార్గాన్ని వాహనాల రాకపోకల నుంచి స్పష్టంగా వేరు చేసి గుర్తించాలని సూచించింది. ఆ మార్గాలు ఎలాంటి ఆక్రమణలకు గురికాకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని పేర్కొంది. ఈ అంశంపై విచారణ చేపట్టిన జస్టిస్ పీఎస్ నరసింహ, జస్టిస్ అలోక్ అరాధేలతో కూడిన ధర్మాసనం కేంద్రానికి కీలక ఆదేశాలు జారీ చేసింది. విచారణ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం తరఫున హాజరైన అదనపు సొలిసిటర్ జనరల్ కేఎం నటరాజ్‌కు ధర్మాసనం పలు సూచనలు చేసింది. దేశంలో ఎక్కడ రహదారి ఉంటే అక్కడ పాదచారుల కోసం కూడా ప్రత్యేక మార్గం తప్పనిసరిగా ఉండాలని స్పష్టం చేసింది. ఇందుకోసం భారీగా నిధులు ఖర్చు చేయాల్సిన అవసరం లేదని, తాడు లేదా ఇతర తాత్కాలిక గుర్తులతోనైనా పాదచారుల మార్గాన్ని స్పష్టంగా గుర్తించవచ్చని తెలిపింది. ప్రధాన ఉద్దేశం పాదచారులకు భద్రత కల్పించడమేనని పేర్కొంది.

పాదచారుల కోసం కేటాయించిన స్థలాన్ని ఎలాంటి ఆక్రమణలు లేకుండా పరిరక్షించాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. ఆ మార్గంలో వాహనాలు ప్రవేశించకుండా చర్యలు తీసుకోవడంతో

మిగతా 2వ పేజీలో..



## జంతర్‌మంతర్‌పై సుప్రీంకోర్టు దృష్టి

- ధర్నాల వేదిక మార్పుపై ప్రజాహిత వ్యాజ్యం
- కేంద్రంతో చర్చించాలని సొలిసిటర్ జనరల్‌కు ఆదేశం
- స్థానికులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయన్న పిటిషనర్ వాదన
- పిటిషన్‌పై కేంద్రానికి నోటీసులు జారీ చేసిన ధర్మాసనం

2వ పేజీలో..

## ఈయేడు కుంభవృష్టి వర్షాలు

- వర్షాలతో ప్రాణనష్టం కూడా ఎక్కువే
- రంగం భవిష్యవాణిలో మాతంగి వెల్లడి



హైదరాబాద్,ఆగస్ట్3 సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి అమ్మవారి ఆలయంలో మాతంగి స్వర్ణలత భవిష్యవాణి(రంగం)

మిగతా 2వ పేజీలో..

## ఉద్యోగాల హామీ ఏమైంది..?

- జాబ్ క్యాలెండర్ అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం
- నిరుద్యోగులు,విద్యార్థులు, రైతుల సమస్యలను పట్టించుకోవడం లేదు
- ఇంజనీర్లపై వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించిన బీఆర్ఎస్
- నిరుద్యోగులు ఆత్మహత్యలకు పాల్పడొద్దు
- అసెంబ్లీలో ప్రభుత్వాన్ని నిలదీస్తాం
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్




హైదరాబాద్, ఆగస్టు 3, తరంగాలు ప్రతినిధి : కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. సోమవారం తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన ఉద్యోగాల భర్తీ, జాబ్ క్యాలెండర్,నిరుద్యోగులు, విద్యార్థులు,ఇంజినీర్లు, కాళేశ్వరం,సాగునీటి ప్రాజెక్టులు, మెట్రో తదితర అంశాలపై రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు.రెండేళ్లలో పదివేల ఉద్యోగాలు కూడా భర్తీ చేయలేదు ఎన్నికల ముందు రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని

మిగతా 2వ పేజీలో..



## కాకతీయ వైభవానికి కేంద్రం పెద్దపీట వేయాలి

**వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య**

న్యూఢిల్లీ, ఆగస్టు 3,తరంగాలు : వరంగల్ ప్రజల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచిన కాకతీయ వారసత్వ పరిరక్షణ, అభివృద్ధి అంశాన్ని లోక్‌సభ వేదికగా వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య బలంగా ప్రశ్నించారు. కాకతీయుల చరిత్ర, సంస్కృతి, కళా వైభవం కేవలం తెలంగాణకే కాకుండా దేశానికి గర్వకారణమని, అలాంటి వారసత్వ సంపదకు మరింత ప్రాధాన్యం కల్పించాల్సిన బాధ్యత కేంద్ర

మిగతా 2వ పేజీలో..

## పడిదల నవీన్ కుమార్‌కు 'టైమ్స్ ఆఫ్ ఇండియా తెలంగాణ 2026 ఎక్సలెన్స్ అవార్డు'

- కార్పొరేట్ సివిల్ అండ్ ఇంటీరియర్ సొల్యూషన్స్‌లో ప్రతిభకు ప్రతిష్ఠాత్మక గుర్తింపు
- గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లా,సోనూ సూద్ అవార్డు అందుకున్న నవీన్ కుమార్



హైదరాబాద్, ఆగస్టు 3, :హైదరాబాద్ నగరంలోని నోవోటల్ లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో యువ పారిశ్రామికవేత్త పడిదల నవీన్ కుమార్ ప్రతిష్ఠాత్మక 'ది టైమ్స్ ఆఫ్ ఇండియా తెలంగాణ 2026 ఎక్సలెన్స్ ఇన్ కార్పొరేట్ సివిల్ అండ్ ఇంటీరియర్ సొల్యూషన్స్ అవార్డు' ను అందుకున్నారు.గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లా సమక్షంలో ప్రముఖ నటుడు, సేవా కార్యక్రమాలతో గుర్తింపు పొందిన సోనూ సూద్ చేతుల మీదుగా నవీన్ కుమార్ ఈ అవార్డును స్వీకరించారు.ఈ సందర్భంగా నవీన్ కుమార్ మాట్లాడుతూ, గవర్నర్ సమక్షంలో సోనూ సూద్ చేతుల మీదుగా అవార్డు అందుకోవడం తనకు ఎంతో గౌరవంగా ఉందన్నారు. ఈ ప్రతిష్ఠాత్మక గుర్తింపును అందించిన 'ది టైమ్స్ ఆఫ్ ఇండియా'కు హృదయపూర్వక కృతజ్ఞతలు

మిగతా 2వ పేజీలో..

## నిమ్స్ వైద్య బృందానికి సీఎం అభినందనలు

తీసుకురావాలనే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం నిమ్స్ విజయంతో సాకారమవుతోందన్నారు. అధునాతన సాంకేతికతను ప్రభుత్వ వైద్య సేవల్లో ప్రవేశపెట్టి నాణ్యమైన చికిత్సను ప్రజలకు అందించడం ఆరోగ్య రంగంలో కీలక ముందడుగుగా అభివర్ణించారు. నిమ్స్‌లో ఇప్పటివరకు నిర్వహించిన రోబోటిక్ శస్త్రచికిత్సల్లో 90 శాతానికి పైగా ఆరోగ్యశ్రీ, ముఖ్యమంత్రి సహాయ నిధి పథకాల ద్వారా పూర్తిగా ఉచితంగా నిర్వహించడం అభినందనీయమని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. అత్యాధునిక చికిత్సను ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు కూడా అందుబాటులోకి తీసుకురావడం ప్రభుత్వ ప్రజా సంక్షేమ దృక్పథానికి నిదర్శనమని అన్నారు. ఇటీవలే రెండు వేల మూత్రపిండ మార్పిడి శస్త్రచికిత్సలను విజయవంతంగా పూర్తి చేసిన నిమ్స్, ఇప్పుడు వెయ్యి రోబోటిక్ శస్త్రచికిత్సల మైలురాయిని చేరుకోవడం ద్వారా మరో కొత్త రికార్డు సృష్టించిందని రేవంత్ రెడ్డి తెలిపారు. వైద్య సేవల నాణ్యత, సాంకేతిక సామర్థ్యం, వైద్య బృందం నిబద్ధతకు ఇది నిదర్శనమని కొనియాడారు. నిమ్స్ వైద్య బృందం సమిష్టి కృషి వల్లే ఈ విజయాలు సాధ్యమయ్యాయని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. రోగుల ఆరోగ్యాన్ని అత్యున్నత ప్రమాణాలతో కాపాడేందుకు వైద్యులు, నర్సులు, సాంకేతిక సిబ్బంది అంకితభావంతో పనిచేస్తున్నారని ప్రశంసించారు. రాష్ట్ర ప్రభుత్వం వైద్య రంగాన్ని మరింత బలోపేతం చేసేందుకు అవసరమైన అన్ని చర్యలు కొనసాగిస్తోందని తెలిపారు. భవిష్యత్తులో కూడా నిమ్స్ మరిన్ని మైలురాళ్లు అధిగమిస్తూ తెలంగాణను వైద్య రంగంలో దేశానికి ఆదర్శంగా నిలపాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. ఆధునిక వైద్య సదుపాయాలను మరింత విస్తరించి ప్రతి పౌరుడికి నాణ్యమైన ఆరోగ్య సేవలు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన స్పష్టం చేశారు.

## నిమ్స్‌లో వెయ్యో రోబోటిక్ శస్త్రచికిత్స

రోజుల సంఖ్య తగ్గడం, రోగులు త్వరగా కోలుకునే అవకాశం లభిస్తోందని నిమ్స్ వైద్యులు తెలిపారు. రోగుల చికిత్సలో ఆధునిక సాంకేతికతను సమర్థవంతంగా వినియోగిస్తూ మెరుగైన వైద్య ఫలితాలు సాధిస్తున్నట్లు పేర్కొన్నారు.


నిర్వహించిన వెయ్యి రోబోటిక్ శస్త్రచికిత్సల్లో యూరాలజీ విభాగం అత్యధికంగా 590 శస్త్రచికిత్సలు నిర్వహించింది. ప్రోస్టేట్, మూత్రాశయ క్యాన్సర్ శస్త్రచికిత్సలు, మూత్రపిండ మార్పిడి, మూత్రనాళ పునర్నిర్మాణం, పిల్లల్లో నిర్వహించే ప్రత్యేక శస్త్రచికిత్సలు వంటి అనేక క్లిష్ట ఆపరేషన్లు విజయవంతంగా పూర్తి చేసింది. సర్జికల్ గ్యాస్ట్రోఎంటరాలజీ విభాగం 248 శస్త్రచికిత్సలు, సర్జికల్ ఆంకాలజీ విభాగం 162 రోబోటిక్ శస్త్రచికిత్సలు నిర్వహించి ఈ ఘనతలో కీలక పాత్ర పోషించాయి. ఈ విజయాల్లో అత్యంత విశేషమైన అంశం ఏమిటంటే వెయ్యి శస్త్రచికిత్సల్లో 90 శాతానికి పైగా ఆరోగ్యశ్రీ, ముఖ్యమంత్రి సహాయ నిధి పథకాల ద్వారా పూర్తిగా ఉచితంగా నిర్వహించడం. అత్యాధునిక రోబోటిక్ వైద్యం సాధారణంగా అధిక వ్యయంతో కూడుకున్నప్పటికీ, ప్రభుత్వ మద్దతుతో ఆర్థికంగా వెనుకబడిన ప్రజలకు కూడా ఈ సేవలను అందుబాటులోకి తీసుకురావడం ప్రజారోగ్య రంగంలో గొప్ప ముందడుగుగా వైద్య నిపుణులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా నిమ్స్ సంచాలకుడు డాక్టర్ రాహుల్ దేవరాజ్ మాట్లాడుతూ, యూరాలజీ, సర్జికల్ గ్యాస్ట్రోఎంటరాలజీ, సర్జికల్ ఆంకాలజీ, మత్తుమందు విభాగం, నర్సింగ్ సిబ్బంది, ఆపరేషన్ థియేటర్ సిబ్బంది, ఇతర విభాగాల సమిష్టి కృషి వల్లే ఈ చారిత్రక ఘట్టం సాధ్యమైందన్నారు. రోబోటిక్ శస్త్రచికిత్సల రంగంలో నిమ్స్‌ను జాతీయ స్థాయి అత్యుత్తమ కేంద్రంగా నిలబెట్టడంలో ప్రతి ఒక్కరి పాత్ర కీలకమని ఆయన అభినందించారు. రాష్ట్రంలో అత్యాధునిక వైద్య సేవలను మరింత విస్తరించేందుకు ప్రభుత్వం అందిస్తున్న సహకారం వల్లే ఈ ఘనత సాధ్యమైందని డాక్టర్ రాహుల్ దేవరాజ్ తెలిపారు. వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అందిస్తున్న ప్రోత్సాహం, ఆరోగ్య మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలతో నిమ్స్ మరిన్ని కొత్త మైలురాళు అధిగమించే దిశగా ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా ప్రజలకు ప్రపంచ స్థాయి రోబోటిక్ వైద్య సేవలను అందిస్తూ తెలంగాణతో పాటు దేశవ్యాప్తంగా ఆదర్శ సంస్థగా నిలవాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించారు.

## పాదచారుల భద్రతే ప్రాధాన్యం

పాటు, పాదచారులు ఎలాంటి భయం లేకుండా స్వేచ్ఛగా నడిచే పరిస్థితులు కల్పించాలని సూచించింది. దీనిపై సంబంధిత శాఖలకు అవసరమైన ఆదేశాలు జారీ చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని ధర్మాసనం ఆదేశించింది. ఈ చర్యల అమలుపై నివేదిక సమర్పించేందుకు రెండు వారాల గడువు ఇచ్చి తదుపరి విచారణను వాయిదా వేసింది. ఇదే అంశంపై జూన్ 19న సుప్రీంకోర్టు ఇచ్చిన చారిత్రాత్మక తీర్పును కూడా ధర్మాసనం గుర్తు చేసింది. ప్రత్యేకంగా గుర్తించిన ఫుట్‌పాత్‌పై నడవడం ప్రతి పౌరుడి ప్రాథమిక హక్కు అని అప్పట్లో స్పష్టం చేసింది. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 19(1)(డి) కింద కల్పించిన స్వేచ్ఛగా సంచరించే హక్కుతో పాటు, ఆర్టికల్ 21లోని జీవించే హక్కులో కూడా పాదచారుల భద్రత అంతర్భాగమేనని పేర్కొంది. అదే విధంగా, ప్రత్యేకంగా గుర్తించిన పాదచారుల మార్గాల్లో మోటారు వాహనాల కంటే పాదచారుల హక్కుకే ప్రాధాన్యం ఉంటుందని సుప్రీంకోర్టు తన తీర్పులో స్పష్టం చేసింది. ప్రజల ప్రాణ భద్రత, సౌకర్యవంతమైన రాకపోకలు, ప్రమాదాల నివారణ వంటి అంశాలను దృష్టిలో ఉంచుకుని ఫుట్‌పాత్‌లను పరిరక్షించడం ప్రభుత్వాల బాధ్యత అని పేర్కొంది. పట్టణాలు, నగరాల్లో పాదచారుల హక్కులు కచ్చితంగా అమలయ్యేలా చూడాలని సూచించింది. సుప్రీంకోర్టు తాజా ఆదేశాలతో దేశవ్యాప్తంగా రహదారి నిర్మాణం, పట్టణ ప్రణాళిక, ట్రాఫిక్ నిర్వహణలో పాదచారుల భద్రతకు మరింత ప్రాధాన్యం లభించే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఫుట్‌పాత్‌ల ఆక్రమణలను తొలగించడం, పాదచారుల కోసం ప్రత్యేక మార్గాలను గుర్తించడం, భద్రతా ప్రమాణాలను అమలు చేయడం వంటి చర్యలు వేగవంతం కావచ్చని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

## వెల్ నెస్ సెంటర్ ద్వారా మెరుగైన వైద్య సేవలు అందించాలి

### హనుమకొండ జిల్లా ఇంచార్జి కలెక్టర్ ఎన్. రవి



హనుమకొండ ప్రతినిధి : ఆగష్టు 3, తరంగాలు .వెల్ నెస్ సెంటర్ ద్వారా మెరుగైన వైద్య సేవలు అందించాలని హనుమకొండ జిల్లా ఇంచార్జి కలెక్టర్ ఎన్. రవి అన్నారు. సోమవారం హనుమకొండ ప్రభుత్వ ప్రసూతి వైద్యశాల పక్కన ఉన్న ప్రభుత్వ ఉద్యోగులు, జర్నలిస్టులు, పెన్షనర్లకు వైద్య సేవలను అందించే వెల్ నెస్ సెంటర్ ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. వెల్ నెస్ సెంటర్ లోని జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, డెంటల్, కంటి విభాగం, ల్యాబ్, ఫార్మసీ, ఓపీ విభాగాలను పరిశీలించారు. ఎంతమంది వైద్యులు, సిబ్బంది విధులకు హాజరయ్యారని అదనపు కలెక్టర్ వెల్ నెస్ సెంటర్ ఇన్ ఛార్జ్ డాక్టర్ సుష్మితను అడిగి తెలుసుకున్నారు. వైద్యులు, సిబ్బంది హాజరు పట్టికను తనిఖీ చేశారు. అక్కడికి వైద్య సేవల నిమిత్తం వచ్చిన పేషంట్లతోనూ మాట్లాడి వైద్య సేవలు ఎలా ఉంటున్నాయని అడిగారు. ఈ సందర్భంగా ఇంచార్జి కలెక్టర్ ఎన్. రవి మాట్లాడుతూ వెల్ నెస్ సెంటర్ కు వచ్చే పేషంట్లకు ఎక్కడ కూడా ఇబ్బందులు కలగకుండా మెరుగైన వైద్య సేవలను అందించాలని సూచించారు. వెల్ నెస్ సెంటర్ వద్ద పరిసరాలు బాగుండాలన్నారు. ప్రత్యేక విభాగాల వైద్య నిపుణుల చేత కూడా వైద్య సేవలను పేషంట్లకు అందించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. మందుల కొరత లేకుండా చూసుకోవాలన్నారు. ల్యాబ్ ద్వారా పేషంట్లకు అవసరమయ్యే వివిధ పరీక్షలని నిర్వహించాలన్నారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అప్పయ్య, వైద్యులు పాల్గొన్నారు.

## పడిదల నవీన్ కుమార్‌కు 'టైమ్స్ ఆఫ్ ఇండియా తెలంగాణ 2026 ఎక్సలెన్స్ అవార్డు'




తెలిపారు. ఈ అవార్డు తన విజయానికి సహకరించిన క్లయింట్లు, పీ హెచ్ ఎస్ కుటుంబ సభ్యులు, స్నేహితులు, శ్రేయోభిలాషులందరికీ అంకితం చేస్తున్నట్లు నవీన్ కుమార్ పేర్కొన్నారు. తనపై నమ్మకం ఉంచి ప్రోత్సహించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు.

## జంతర్‌మంతర్‌పై సుప్రీంకోర్టు
## జంతర్‌మంతర్‌పై సుప్రీంకోర్టు దృష్టి

- ధర్నాల వేదిక మార్పుపై ప్రజాహిత వ్యాజ్యం
- కేంద్రంతో చర్చించాలని సొలిసిటర్ జనరల్‌కు ఆదేశం
- స్థానికులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయన్న పిటిషనర్ వాదన
- పిటిషన్‌పై కేంద్రానికి నోటీసులు జారీ చేసిన ధర్మాసనం



న్యూఢిల్లీ, ఆగస్టు 3 (డిజైనర్ టెక్ గురు ప్రతినిధి): దేశ రాజధాని ఢిల్లీలో నిరసనలు, ధర్నాలకు ప్రధాన వేదికగా ఉన్న జంతర్‌మంతర్‌ను మరో ప్రాంతానికి మార్చాలని కోరుతూ దాఖలైన ప్రజాహిత వ్యాజ్యాన్ని విచారణకు స్వీకరించేందుకు సుప్రీంకోర్టు అంగీకరించింది. ఈ అంశంపై కేంద్ర ప్రభుత్వంతో చర్చించాలని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతాకు సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసింది. జంతర్‌మంతర్‌లో ప్రస్తుతం ఉన్న పరిస్థితులు నిరసన కార్యక్రమాలకు అనుకూలంగా లేవని పిటిషనర్ సతీష్ చంద్ కౌశిక్ తన వ్యాజ్యంలో పేర్కొన్నారు. జంతర్‌మంతర్ ప్రాంతంలో మురుగునీటి వ్యవస్థ, ఆహార సదుపాయాలు, తాగునీరు, పారిశుద్ధ్య వసతులు తగిన స్థాయిలో లేవని పిటిషన్‌లో వివరించారు. పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొనే ఆందోళనలను నిర్వహించేందుకు అవసరమైన మౌలిక సదుపాయాలు లేకపోవడంతో ప్రజలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని పేర్కొన్నారు. అందువల్ల నిరసనల కోసం ప్రత్యేకంగా అన్ని సౌకర్యాలతో కూడిన కొత్త వేదికను ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరారు. జంతర్‌మంతర్‌లో తరచుగా జరుగుతున్న ధర్నాలు, రాజకీయ ర్యాలీల కారణంగా స్థానిక నివాసితులు తీవ్ర అసౌకర్యాన్ని ఎదుర్కొంటున్నారని పిటిషన్‌లో వెల్లడించారు. ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడటంతో పాటు అత్యవసర సేవలు, నిత్యావసర వస్తువుల రవాణాపైనా ప్రభావం పడుతోందని వివరించారు. ప్రజల సాధారణ జీవనం దెబ్బతింటోందని కూడా పిటిషనర్ వాదించారు. ఈ ప్రజాహిత వ్యాజ్యాన్ని ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్, న్యాయమూర్తులు జోయ్‌మాల్యా బాగ్చి, వీ. మోహన్‌లతో కూడిన ధర్మాసనం విచారించింది. పిటిషన్‌లో లేవనెత్తిన అంశాలు ప్రాధాన్యమైనవేనని ధర్మాసనం అభిప్రాయపడింది. అనంతరం కేంద్ర ప్రభుత్వానికి నోటీసులు జారీ చేస్తూ తమ అభిప్రాయాన్ని తెలియజేయాలని ఆదేశించింది. జంతర్‌మంతర్ ప్రాంతంలో అత్యవసర వైద్య సేవలు అందించడం కూడా కష్టంగా మారుతోందని పిటిషనర్ కోర్టు దృష్టికి తీసుకువచ్చారు. పెద్ద ఎత్తున జరిగే నిరసనల కారణంగా అంబులెన్సులు, ఇతర అత్యవసర సేవలు ఆలస్యమవుతున్నాయని పేర్కొన్నారు. ప్రజా భద్రత దృష్ట్యా ప్రత్యామ్నా య ప్రదేశాన్ని గుర్తించడం అవసరమని వాదించారు. జూలై 20న చోటుచేసుకున్న పరిస్థితులు మళ్లీ పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కూడా పిటిషన్‌లో కోరారు. నిరసన హక్కును కాపాడుతూనే ప్రజల సాధారణ జీవనానికి అంతరాయం కలగకుండా సమతుల్య విధానాన్ని రూపొందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ అంశంపై కేంద్ర ప్రభుత్వం స్పందించిన తర్వాత తదుపరి విచారణ చేపట్టనున్నట్లు సుప్రీంకోర్టు తెలిపింది.

## కాకతీయ వైభవానికి కేంద్రం పెద్దపీట వేయాలి

ప్రభుత్వంపై ఉందన్నారు. ప్రధానంగా వరంగల్‌కు చరిత్రక గుర్తింపుగా నిలిచిన కాకతీయ కట్టడాలు, సంప్రదాయ కళలు, చేనేత--హస్తకళలు, సాంస్కృతిక ఉత్సవాలు, పర్యాటక అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం గత మూడేళ్లలో ఎలాంటి చర్యలు తీసుకుందో వివరించాలని ఎంపీ డా. కడియం కావ్య కోరారు. ఈ మేరకు కేంద్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ సమాధానం లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. తెలంగాణలో ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా (ఏఎస్ఐ) పరిధిలో 9 రక్షిత కట్టడాలు ఉన్నాయని, వాటిలో వరంగల్ జిల్లాకు చెందిన కాకతీయ వారసత్వ కట్టడాలు కూడా ఉన్నాయని తెలిపారు. అవసరాలు, నిధుల లభ్యత మేరకు వాటి పరిరక్షణ, నిర్వహణ పనులు కొనసాగుతున్నాయని వెల్లడించారు. ఈ సందర్భంగా వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య మాట్లాడుతూ, వరంగల్ కోట, వేయి స్తంభాల గుడి, కాకతీయ కళా సంపద, చేనేత, హస్తకళలు, సాంస్కృతిక ఉత్సవాల అభివృద్ధికి ఇంకా విస్తృత స్థాయిలో చర్యలు అవసరమని అన్నారు. హెరిటేజ్ సిటీగా వరంగల్‌కు గుర్తింపు లభించినప్పటికీ, నగరంలోని చారిత్రక కట్టడాల అభివృద్ధి పనులు మరింత వేగవంతం కావాలని డా. కడియం కావ్య అభిప్రాయపడ్డారు. వరంగల్ కోట, వేయి స్తంభాల గుడి వద్ద ప్రపంచ స్థాయి పర్యాటక సదుపాయాలు కల్పిస్తే వేలాది మంది దేశ, విదేశీ పర్యాటకులు వచ్చే అవకాశం ఉందన్నారు. ప్రసాద్ పథకం కింద రామప్ప దేవాలయ అభివృద్ధికి కేంద్రం నిధులు కేటాయించడం సానుకూల పరిణామమే అయినప్పటికీ, కాకతీయ వారసత్వానికి సంబంధించిన అన్ని ప్రాంతాలను సమగ్రంగా అభివృద్ధి చేసే ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను కేంద్రం రూపొందించాలన్నారు. కాకతీయుల చరిత్రను ప్రపంచానికి చాటిచెప్పేలా ప్రత్యేక సాంస్కృతిక, పర్యాటక ప్రాజెక్టులు చేపట్టాలని కోరారు. వరంగల్ కోట అభివృద్ధికి ఏఎస్ఐ, కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ మధ్య ఒప్పందం కుదరడం స్వాగతించదగ్గ విషయమని, అయితే పనులు కాగితాలకే పరిమితం కాకుండా త్వరితగతిన పూర్తయ్యేలా కేంద్రం చర్యలు తీసుకోవాలని సూచించారు. "కాకతీయుల వారసత్వం తెలంగాణ ప్రజల భావోద్వేగాలతో ముడిపడి ఉందని, ఈ సంపదను పరిరక్షించడం, భావితరాలకు అందించడం మనందరి బాధ్యత అన్నారు. వరంగల్ అభివృద్ధి, కాకతీయ వైభవ పునరుద్ధరణ కోసం పార్లమెంట్‌లోనూ, కేంద్ర ప్రభుత్వ స్థాయిలోనూ నిరంతరం తాను పోరాడుతాను" అని వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య స్పష్టం చేశారు.

## పెద్ది సుదర్శన్‌రెడ్డికి ఘన నివాళి



నల్లబెల్లి, ఆగస్టు 3, తరంగాలు : నర్సంపేట మాజీ శాసనసభ్యులు పెద్ది సుదర్శన్‌రెడ్డి అకాల మరణం పట్ల పలువురు నాయకులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన మృతికి నివాళులర్పించేందుకు నాలుగో రోజు నల్లబెల్లిలోని పెద్ది సుదర్శన్‌రెడ్డి నివాసానికి పలువురు నాయకులు చేరుకుని నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాజీ టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు, తెలంగాణ రాష్ట్ర రైతు రుణ విమోచన కమిషన్ మాజీ చైర్మన్ నాగుర్ల వెంకటేశ్వర్లు, మాజీ చైర్మన్ మర్రి యాదవరెడ్డి, టీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు భరత్‌కుమార్‌రెడ్డి, టీఆర్ఎస్ నల్లబెల్లి మండల అధ్యక్షులు సారంగపాణి, మాజీ జెడ్పీటీసీ హరినాథ్‌సింగ్, డాక్టర్ చిరంజీవి మోటె, నాయకులు సముద్రాల మధు, వేణుగోపాల్‌రెడ్డి, పిల్లల నాగరాజు, భాస్కర్, తెలంగాణ విజయ్ తదితరులు పెద్ది సుదర్శన్‌రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు పెద్ది సుదర్శన్‌రెడ్డితో తమకున్న అనుబంధాన్ని, ఆయన ప్రజా జీవితంలో అందించిన సేవలను గుర్తు చేసుకున్నారు. ప్రజల సమస్యల పరిష్కారం కోసం ఆయన చేసిన కృషిని కొనియాడారు. ఆయన మృతి ప్రజలకు, పార్టీ శ్రేణులకు తీరని లోటని పేర్కొన్నారు. పెద్ది సుదర్శన్‌రెడ్డి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.

## ఈయేడు కుంభవృష్టి వర్షాలు

వినిపించారు. మీరెవరూ నేను చెప్పింది ఏదీ ఆచరించడం లేదంటూ మాతంగి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక్కడకు నేను సంతోషంగా రాలేదు.. క్రోధంతో వచ్చానని అన్నారు. మీ ప్రశ్నలకు ఎందుకు సమాధానం చెప్పాలని నిలదీశారు. నా విగ్రహం ప్రతిష్ట చేస్తానని మాట ఇచ్చి జరిపించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏ ఆపద వచ్చినా.. ప్రమాదం వచ్చినా కాపాడుతున్నానని మాతంగి స్వర్ణలత తెలిపారు. కానీ మీరు చేసే చర్యలే నాకు ఆగ్రహం తెప్పిస్తుందని అన్నారు. వావివరసలు లేకుండా ఘోరాలు జరుగుతున్నాయని..అలాంటి వారిని వదిలిపెట్టనని అన్నారు. వారిని పాదాల కింద నలిపేస్తానని అన్నారు. ఈ ఏడాది ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మాతంగి భవిష్యవాణిలో చెప్పారు. ఈ ఏడాది కుంభవర్షాలు ఉన్నాయని తెలిపారు. అగ్నిప్రమాదాలు కూడా పొంచి ఉన్నాయని చెప్పారు.

## ఉద్యోగాల హామీ ఏమైంది..?

కాంగ్రెస్ హామీ ఇచ్చిందని, అయితే అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీని పట్టించుకోవడం లేదని కేటీఆర్ విమర్శించారు. కాంగ్రెస్ ప్రకటించిన జాబ్ క్యాలెండర్ అమలులో పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. రెండేళ్ల పాలనలో పదివేల ఉద్యోగాలు కూడా భర్తీ చేయలేదని అన్నారు. ఉద్యోగాల కోసం నిరుద్యోగ యువత తీవ్ర ఆవేదనకు గురవుతోందని పేర్కొంటూ, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క నియోజకవర్గానికి చెందిన ఓ నిరుద్యోగ యువకుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడటం బాధాకరమన్నారు. ఆ యువకుడు రాసిన లేఖ ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని వ్యాఖ్యానించారు.

"ఆత్మహత్యలు పరిష్కారం కావు"

నిరుద్యోగ యువత ఎట్టి పరిస్థితుల్లోనూ ఆత్మహత్యలకు పాల్పడవద్దని కేటీఆర్ విజ్ఞప్తి చేశారు. ప్రాణాలు కోల్పోవడం సమస్యలకు పరిష్కారం కాదని, ప్రజాస్వామ్య పద్ధతుల్లో పోరాడాలని సూచించారు. విద్యార్థులు, ఉద్యోగార్థులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగ యువతకు తమ పార్టీ అండగా ఉంటుందని తెలిపారు.

### ఇంజినీర్లను అవమానించడం సరికాదు

ఇంజినీర్లపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసినట్లు పేర్కొన్న వ్యాఖ్యలను కేటీఆర్ తీవ్రంగా ఖండించారు. తెలంగాణ అభివృద్ధిలో ఇంజినీర్ల పాత్ర అత్యంత కీలకమని అన్నారు. హైదరాబాద్‌లోని వంతెనలు, ఆధునిక భవనాలు, సాగునీటి ప్రాజెక్టులు, ప్రభుత్వ కార్యాలయాలు, ఇతర మౌలిక వసతుల నిర్మాణంలో ఇంజినీర్ల కృషి ఉందని పేర్కొన్నారు.

దేశ, విదేశాల్లో తెలంగాణకు పేరు తెస్తున్న ఇంజినీర్లను అవమానించేలా మాట్లాడటం సరికాదని, ఇంజినీర్ల గౌరవాన్ని కించపరిచే వ్యాఖ్యలను ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

### విద్యార్థులు, రైతుల సమస్యలపై ప్రశ్నలు

రాష్ట్రంలో విద్యార్థులు, నిరుద్యోగులు, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని కేటీఆర్ ఆరోపించారు. విద్యార్థులపై లాఠీచార్జీలు జరుగుతున్నా కాంగ్రెస్ అగ్రనాయకత్వం స్పందించడం లేదని విమర్శించారు.

గురుకుల విద్యాసంస్థల పరిస్థితి, విద్యా హక్కు చట్టం అమలు, బీసీ రిజర్వేషన్లు, ఐటీ రంగంలో ఉద్యోగాల తగ్గుదల, సాగునీటి ప్రాజెక్టుల నిర్వహణ, గోదావరి జలాల వినియోగం వంటి అంశాలపై ప్రభుత్వాన్ని ఆయన నిలదీశారు.

### అసెంబ్లీలో ప్రజా సమస్యలపై పోరాటం

ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రభుత్వం ఇతర అంశాలపై దృష్టి మళ్లిస్తోందని కేటీఆర్ ఆరోపించారు. అసెంబ్లీ సమావేశాలను పూర్తిస్థాయిలో నిర్వహించి నిరుద్యోగులు, రైతులు, విద్యార్థులు, ప్రజలకు సంబంధించిన అన్ని సమస్యలను ప్రభుత్వం ముందుంచుతామని స్పష్టం చేశారు

కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలపై ప్రజల్లో అవగాహన కల్పిస్తూ, వాటిని ప్రజాస్వామ్య పద్ధతుల్లో ప్రశ్నిస్తామని కేటీఆర్ తెలిపారు.

మీడియా సమావేశంలో మాజీ మంత్రులు జగదీశ్ రెడ్డి, పువ్వాడ అజయ్ కుమార్, ఎమ్మెల్యే అనిల్ జాదవ్, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణరావు, బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## అప్రమత్తతతో వ్యక్తి ప్రాణాలు కాపాడిన హెడ్ కానిస్టేబుల్



**నల్గొండ, ఆగస్టు 3, తరంగాలు:** విధి నిర్వహణలో అప్రమత్తత, సమయస్ఫూర్తి ప్రదర్శించి ఓ వ్యక్తి ప్రాణాలను కాపాడిన చండూరు పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ ఆదిమూలం శ్రీనివాస్‌ను స్థానికులు, ఉన్నతాధికారులు అభినందించారు. ఉడతలపల్లి గ్రామంలో భార్యాభర్తల మధ్య గొడవ జరుగుతోందని డయల్-100కు సమాచారం అందడంతో విధుల్లో ఉన్న హెడ్ కానిస్టేబుల్ ఆదిమూలం శ్రీనివాస్ వెంటనే స్పందించారు. సమాచారం అందిన ఐదు నిమిషాల్లోనే సంఘటనా స్థలానికి చేరుకున్నారు. అక్కడ ఓ వ్యక్తి ఉరి వేసుకుని ప్రాణాపాయ స్థితిలో ఉన్నట్లు గుర్తించిన ఆయన పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకుని తక్షణమే స్పందించారు. ఇంటి ప్రధాన ద్వారం తెరిచి లోపలికి ప్రవేశించి, బాధితుడికి అవసరమైన ప్రాథమిక సహాయం అందించారు. అనంతరం అతడిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించడంలో కీలక పాత్ర పోషించారు. అత్యవసర సమయంలో హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్ చూపిన అప్రమత్తత, ధైర్యం, సమయస్ఫూర్తిపై స్థానికులు ప్రశంసలు కురిపించారు. అత్యవసర పరిస్థితుల్లో పోలీసులు వేగంగా స్పందిస్తూ ప్రజల ప్రాణ రక్షణకు కట్టుబడి ఉంటారనడానికి ఈ ఘటన నిదర్శనంగా నిలిచింది.

## ప్రజావాణి వినతులకు గడువులోగా పరిష్కారం చూపాలి: కలెక్టర్ అంకిత్



**భద్రాద్రి జిల్లా బ్యూరో తరంగాలు న్యూస్ ఆగస్టు 3:** ప్రజావాణిలో స్వీకరించిన ప్రతి వినతిని జాప్యం లేకుండా నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఐడీఓసీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి భూ వివాదాలు, సంక్షేమ పథకాలు, పెన్షన్లు, గృహాలు, తాగునీరు, విద్యుత్, మౌలిక వసతులు తదితర సమస్యలకు సంబంధించిన వినతులను స్వీకరించారు. అనంతరం సంబంధిత శాఖల అధికారులకు ఎండార్స్ చేస్తూ తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం, జాప్యానికి తావివ్వకుండా బాధ్యతాయుతంగా పనిచేయాలని కలెక్టర్ సూచించారు.

## మృతుడు కుటుంబాన్ని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే రాజయ్య



**జఫర్గడ్ ప్రతినిధి, ఆగస్టు 3,(తరంగాలు):** వడ్డెగూడెం గ్రామానికి చెందిన ఇటీవల అనారోగ్యంతో పరమపదించిన మామిడాల ప్రభాకర్ కుటుంబ సభ్యు మాజీ రాష్ట్ర తొలి ఉప ముఖ్యమంత్రివర్యులు మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య పరామర్శించి, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ క్లిష్ట సమయంలో ధైర్యంగా ఉండాలని కుటుంబ సభ్యులను ఓదార్చి, తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బి ఆర్ యస్ పార్టీ మండల నాయకులు ఉప సర్పంచ్ కుమార్ కన్వీనర్ రాజకుమార్ నజీర్ గ్రామ శాఖ అధ్యక్షులు శ్రీధర్ స్వామి కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు

## ఎస్ఎఫ్ఐ మండల నూతన అధ్యక్ష, కార్యదర్శులుగా నరసింహ, హర్షిత్ ఏకగ్రీవ ఎన్నిక




**జఫర్‌గఢ్ ప్రతినిధి, ఆగస్టు 3, (తరంగాలు):** ఎస్ఎఫ్ఐ మండల మహాసభ స్థానిక ఆదర్శ పాఠశాల ఆవరణలో ఘనంగా జరిగాయి. ఈ మహాసభల్లో 2 మందితో కూడిన నూతన మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి దాసగాని సుమ ఒక ప్రకటనలో తెలిపారు. నూతన కమిటీఅధ్యక్షుడు టీ. నరసింహ, కార్యదర్శి రడపాక హర్షిత్, ఈ సందర్భంగా నూతన అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ స్వాతంత్ర్యం, ప్రజాస్వామ్యం, సోషలిజంఅనే లక్ష్యాలతో ముందుకు సాగుతామని అన్నారు. మండలంలోని విద్యార్థుల సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తామని, పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని, ప్రభుత్వ కళాశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఆగస్టు 6న హైదరాబాద్ ఇందిరాపార్క్ వద్ద జరిగే మహా ధర్నాను జయప్రదం చేస్తామని, మండలం నుండి వందలాది మంది విద్యార్థులతో తరలి వెళ్తామని పేర్కొన్నారు. విద్య, ఉద్యోగ హక్కుల సాధన కోసం అందరూ కదలి రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా, మండల నాయకులు, మండలంలోని వివిధ కళాశాలల విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

### వేణుకుమార్ కుటుంబానికి

# నామ ట్రస్ట్ ద్వారా రూ.50 వేల ఆర్థిక సాయం

- **దయచేసి నిరుద్యోగులు ఆత్మహత్యలకు పాల్పడొద్దు : మాజీ ఎంపీ నామ విజ్ఞప్తి**

**తరంగాలు ఖమ్మం జిల్లా బ్యూరో :** రాష్ట్ర ప్రభుత్వం గ్రూప్స్ నోటిఫికేషన్లు విడుదల చేయడం లేదని ఆవేదనతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ముదిగొండ మండలం లక్ష్మీపురం గ్రామానికి చెందిన నిరుద్యోగ యువకుడు జీ.వేణుకుమార్ ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నేపథ్యంలో ఆదివారం బీఆర్ఎస్ మాజీ లోక్‌సభ పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు, మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్, ఎమ్మెల్సీ తాత మధుసూదన్, జడ్పీ మాజీ చైర్మన్ లింగాల కమల్‌రాజు ఆస్పత్రికి వెళ్లి వేణుకుమార్‌ను పరామర్శించి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పిన విషయం తెలిసిందే. పరామర్శ సందర్భంగా వేణుకుమార్ కుటుంబ పరిస్థితిని తెలుసుకున్న నామ చలించిపోయి తన నామ ముత్తయ్య మెమోరియల్ ట్రస్ట్ ద్వారా రూ.50 వేల రూపాయలు సోమవారం మధిర నియోజకవర్గ ఇన్‌చార్జి లింగాల కమల్‌రాజు, మాజీ ఎంపీపీ సామినేని హరిప్రసాద్, ట్రస్ట్ ప్రతినిధి కనకమేడల సత్యనారాయణ చేతుల మీదుగా వేణుకుమార్ కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఆదివారం వేణుకుమార్ నాయనమ్మకు ధైర్యం చెబుతూ "నేను అండగా ఉంటాను" అని భరోసా ఇచ్చిన నామ, చెప్పిన మాటను నిలబెట్టుకుంటూ పరామర్శించిన మరుసటి రోజే ఆర్థిక సాయం అందించడం విశేషం. క్లిష్ట సమయంలో నామ ముత్తయ్య మెమోరియల్ ట్రస్ట్ బాధిత కుటుంబానికి అండగా నిలిచింది. నిరుద్యోగుల పక్షాన బీఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ ఉంటుందని నామ పేర్కొన్నారు. సమస్యలకు ఆత్మహత్య పరిష్కారం కాదని, నిరుద్యోగ యువత ధైర్యంగా ఉండాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ ఆత్మహత్యలకు పాల్పడవద్దని విజ్ఞప్తి చేశారు. ఆపద సమయంలో అండగా నిలిచి వెంటనే ఆర్థిక సహాయం అందించిన నామకు వేణుకుమార్ కుటుంబ సభ్యులు, నిరుద్యోగ యువత కృతజ్ఞతలు తెలిపారు. వేణుకుమార్ ఒక్కడి సమస్య కాదు.. లక్షలాది నిరుద్యోగుల ఆవేదన:లింగాల కమల్‌రాజు ఈ సందర్భంగా కమల్‌రాజు మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగులను నమ్మించి మోసం చేస్తోందని విమర్శించారు. 31 నెలల పాలనలో ఇచ్చిన హామీల్లో ఒక్కదానినీ పూర్తిగా అమలు చేయలేదని ఆరోపించారు.





వేణుకుమార్ ఆత్మహత్యాయత్నం నిరుద్యోగుల పట్ల ప్రభుత్వానికి ఉన్న నిర్లక్ష్యానికి నిదర్శనమని,నిరుద్యోగులు పడుతున్న వేదనకు ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. వేణుకుమార్ కుటుంబానికి అండగా నిలవాలనే ఉద్దేశంతో మాజీ ఎంపీ నామా నాగేశ్వరరావు వారి నామా ముత్తయ్య మెమోరియల్ ట్రస్ట్ ద్వారా ఆర్థిక సాయాన్ని అందజేసినట్లు తెలిపారు. కేవలం ఆర్థిక సాయం మాత్రమే కాకుండా, వేణుకుమార్ కోలుకున్న అనంతరం అతనికి అవసరమైన కోచింగ్‌తో పాటు ఇతర అవసరాల్లోనూ బీఆర్ఎస్ పార్టీ పూర్తి సహకారం అందిస్తుందని హామీ ఇచ్చారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి నిరుద్యోగుల సమస్యలను పరిష్కరించాలని, తక్షణమే గ్రూప్స్‌తో పాటు పెండింగ్‌లో ఉన్న ఉద్యోగ నోటిఫికేషన్లను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఇది కేవలం వేణుకుమార్ ఒక్కరి సమస్య కాదని, రాష్ట్రవ్యాప్తంగా ఉన్న లక్షలాది మంది నిరుద్యోగుల సమస్య అని తెలిపారు. ఈ కార్యక్రమంలో మోరంపూడి ప్రసాద్‌రావు, గడ్డం వెంకటేశ్వర్లు, వాకదాని కోటేశ్వరరావు, పెనుగొండ కొండలు, నామ వ్యక్తిగత కార్యదర్శి నాగరాజు, బీఆర్ఎస్ యువజన నాయకులు రేగళ్ల కృష్ణప్రసాద్, పగడాల రవికుమార్, షారుఖ్‌తో పాటు బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని వేణుకుమార్ కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.

# తల్లిపాల వారోత్సవాలను విజయవంతం చేయాలి

- **జిల్లా కలెక్టర్ దివాకర.టిఎస్**
- **1 నుంచి 7 వరకు జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక కార్యక్రమాలు**
- **మొదటి ఆరు నెలల వరకు శిశువుకు తల్లిపాలే సంపూర్ణ ఆహారం**
- **తల్లిపాల ప్రాధాన్యంపై విస్తృత అవగాహన కల్పించాలి**
- **తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా పోస్టర్‌ను ఆవిష్కరణ**



**తరంగాలు ఖమ్మం జిల్లా బ్యూరో :** ఆగస్టు 1 నుంచి 7 వరకు నిర్వహిస్తున్న ప్రపంచ తల్లిపాల వారోత్సవాలను జిల్లా వ్యాప్తంగా విజయవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ సంబంధిత అధికారులను ఆదేశించారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లు డాక్టర్ పి. శ్రీజ, పి. శ్రీనివాస్ రెడ్డి లతో కలిసి జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర.టిఎస్ మాట్లాడుతూ... తల్లిపాలు శిశువుకు ప్రకృతి ప్రసాదించిన అత్యుత్తమ ఆహారమని తెలిపారు. శిశువు పుట్టినప్పటి నుంచి మొదటి ఆరు నెలల వరకు కేవలం తల్లి పాలు మాత్రమే పట్టించేలా ప్రతి కుటుంబానికి అవగాహన కల్పించాలని సూచించారు. ఈ ఆరు నెలల కాలంలో శిశువు ఎదుగుదల, అభివృద్ధికి, రోగ నిరోధక శక్తికి అవసరమైన అన్ని పోషకాలు తల్లిపాలలోనే లభిస్తాయని అన్నారు. ఎక్స్‌క్లూజివ్ బ్రెస్ట్ ఫీడింగ్ అంటే బిడ్డకు ఆరు నెలలు నిండే వరకు తల్లిపాలు తప్ప మరే ఇతర ఆహారం లేదా పానీయం ఇవ్వక పోవడమేనని తెలిపారు. ఈ కాలంలో నీరు, పైపాలు, పాలపొడి లేదా ఇతర ఆహార పదార్థాలు ఇవ్వడం వల్ల శిశువుకు అనారోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉంటుందని, వైద్యుల సూచన లేకుండా పాల పొడి లేదా డబ్బా పాలను వినియోగించరాదని సూచించారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా జిల్లా స్థాయి, ప్రాజెక్టు స్థాయి, అంగన్‌వాడీ కేంద్రాల స్థాయిలో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గర్భిణులు, బాలింతలు, కుటుంబ సభ్యులకు తల్లిపాల ప్రాధాన్యంపై అవగాహన కల్పిస్తూ ప్రతి శిశువుకు మొదటి ఆరు నెలల వరకు కేవలం తల్లిపాలు మాత్రమే అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా జిల్లాలోని అన్ని ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో అవగాహన కార్యక్రమాలు, గర్భిణులు బాలింతలతో సమావేశాలు నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ పరాస్ కుమార్, డిఆర్ఓ సిహెచ్ రామ్మూర్తి, జెడ్పీ సిఈఓ దీక్షా రైనా, జిల్లా మహిళా,శిశు సంక్షేమ శాఖ అధికారి ఎ. ప్రమీల, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ రామారావు, జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఏఓ శ్రీనివాస్, పోషణ్ అభియాన్ సిబ్బంది, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సీ లిఫ్ట్ ఇరిగేషన్ మోటార్లను వెంటనే పునరుద్ధరించాలి..

- **దళిత రైతులను ఆదుకోవాలి**
- **ఎస్సీ లిఫ్ట్ ఇరిగేషన్ మోటార్లు బిగించండి..**
- **దళిత రైతుల పొలాలకు నీళ్లు అందించండి**
- **సింగరేణి మండలం పేరపల్లి గ్రామ దళిత రైతులకు సాగునీరు అందించాలి**
- **జిల్లా కలెక్టర్‌కు టీఎస్ఎస్ఏ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు దామల్ల సత్యనారాయణ వినతి**



**ఖమ్మం టౌన్ , తరంగాలు న్యూస్ ఆగస్టు 3 (న్యూస్):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సింగరేణి మండలం పేరపల్లి గ్రామంలో ఎస్సీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో సుమారు 30 సంవత్సరాల క్రితం ఏర్పాటు చేసిన లిఫ్ట్ ఇరిగేషన్ పథకం ఎన్నో ఏళ్లుగా నిర్వీర్యంగా ఉండటంతో దళిత రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలంగాణ సోషల?స్టు స్టూడెంట్స్ అసోసియేషన్ (టీఎస్ఎస్ఏ) రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు దామల్ల సత్యనారాయణ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించిన ఆయన, ఒకప్పుడు ఈ లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా ఎస్సీ రైతుల వందల ఎకరాలకు సాగునీరు అందేదని, ప్రస్తుతం మోటార్లు, పైప్‌లైన్లు, విద్యుత్ వ్యవస్థ పూర్తిగా దెబ్బతినడంతో పథకం మూతపడిందన్నారు. దీంతో రైతులు వ్యవసాయం చేయలేక ఆర్థికంగా తీవ్ర నష్టాలు చవిచూస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించి లిఫ్ట్ ఇరిగేషన్ పథకాన్ని పునరుద్ధరించాలని, దెబ్బతిన్న మోటార్లు, పైపులు, విద్యుత్ సౌకర్యాలను మరమ్మతు చేయాలని, అవసరమైతే ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులతో శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. ఈ అంశంపై సంబంధిత శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి రైతులకు న్యాయం చేయాలని కోరారు.

ఈ సందర్భంగా రైతుల జీవనోపాధిని కాపాడేందుకు జిల్లా యంత్రాంగం అత్యవసర చర్యలు చేపట్టాలని, సాగునీటి సౌకర్యం పునరుద్ధరణతో దళిత రైతులకు మళ్లీ వ్యవసాయం చేసే అవకాశం కల్పించాలని దామల్ల సత్యనారాయణ విజ్ఞప్తి చేశారు. రామారావు తదితరులు పాల్గొన్నారు..

## బోనాల పండుగ సందర్భంగా ప్రత్యేక ఏర్పాట్లు చేయాలి




**కుత్బుల్లాపూర్ ఆగస్టు 03 ( తరంగాలు )**
ప్రజావాణిలో జీసీఎంసీ డిప్యూటీ కమిషనర్ శంకర్ సింగ్ కు వినతిపత్రం అందజేసిన బీఆర్ఎస్ సీనియర్ నాయకులు వి.నరేందర్ రెడ్డి. రానున్న బోనాల పండుగ సందర్భంగా జీడిమెట్ల సర్కిల్ పరిధిలోని 286, 287 డివిజన్లలోని దేవాలయాల వద్ద భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పించి ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టాలని బీఆర్ఎస్ సీనియర్ నాయకుల వి. నరేందర్ రెడ్డి ప్రజావాణి కార్యక్రమంలో జీసీఎంసీ డిప్యూటీ కమిషనర్ శంకర్ సింగ్ కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వి. నరేందర్ రెడ్డి చేసిన ప్రధాన డిమాండ్లు
1. దేవాలయాల పరిసరాల్లో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలి. 2. చెత్త పేరుకుపోకుండా ప్రత్యేక పారిశుధ్య సిబ్బందిని నియమించాలి. 3. భక్తులకు స్వచ్ఛమైన తాగునీటి సౌకర్యం కల్పించాలి. 4. అన్ని వీధి దీపాలు సక్రమంగా పనిచేసేలా చర్యలు తీసుకోవాలి. 5. తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలి. 6. డ్రైనేజీలను పూర్తిగా శుభ్రపరిచి బ్లీచింగ్ పౌడర్ పిచికారీ చేయాలి. 7. ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక ఏర్పాట్లు చేసి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలి. ఈ సందర్భంగా వి. నరేందర్ రెడ్డి మాట్లాడుతూ, బోనాల పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని పేర్కొన్నారు. పండుగ సందర్భంగా వేలాదిమంది భక్తులు దేవాలయాలను సందర్శించే నేపథ్యంలో అధికారులు ముందస్తు ప్రణాళికతో పనిచేసి పారిశుధ్యం, తాగునీరు, విద్యుత్ వెలుగులు, డ్రైనేజీ నిర్వహణ, ట్రాఫిక్ నియంత్రణతో పాటు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలను సమర్థవంతంగా కల్పించాలని కోరారు. భక్తుల భద్రత, సౌకర్యాలకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ వినతిపత్రం సమర్పించిన కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఆటో బలరాం, రామచంద్ర రెడ్డి, రామ్మోహన్, వెంకటేష్ బాబు తదితరులు పాల్గొని, బోనాల పండుగ సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సంబంధిత అధికారులు తక్షణమే ప్రత్యేక చర్యలు చేపట్టి అన్ని సౌకర్యాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

## 17 లక్షల రూపాయలతో సిసి రోడ్ల నిర్మాణం



**కేసముద్రం,మహబూబాబాద్ జిల్లా, ప్రతినిధి,ఆగస్టు. 03, తరంగాలు:**
కేసముద్రం మండలం భూక్యారం తండా గ్రామపంచాయతీ కి మహబూబాబాద్ శాసనసభ్యులు డాక్టర్ భూక్య మురళి నాయక్ 17 లక్షల రూపాయల సీసీ రోడ్ల నిర్మాణం కు నిధులను మంజూరు చేసినారు.వాటిని సర్పంచ్ జాటోత్ సోమీ ప్రారంభించినారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి అంబటి మహేందర్ రెడ్డి పాల్గొని మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన నాటి నుండి ప్రజా పాలన చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో మహబూబాబాద్ శాసనసభ్యులు డాక్టర్ భూక్య మురళి నాయక్ పల్లెలల అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు.అదేవిధంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రాష్ట్రం ను గుడిసెలు లేని రాష్ట్రంగా తీర్చిదిద్దుతాను అని ప్రకటించడం జరిగిందన్నారు. మాటలు చేతలుగా మారి గ్రామాలలో అధికారులతో సర్వే చేయించి గుడిసెలు ఉన్న వారిని ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులుగా గుర్తించి ఒక నివేదిక పార్టీల అతీతంగా తయారు చేయడం జరుగుతా ఉందనీ తెలిపారు. కానీ కొంతమంది దళారులు ఇండ్లు మేమే ఇస్తాం అని చెబుతూ ప్రభుత్వశీ యొక్క పథకాన్ని పక్కదారి పట్టించే విధంగా మాట్లాడుతున్నారనీ,అర్హులైన గుడిసే వాసులకు ఇండ్లు మంజూరు చేసేది, ఆ నియోజకవర్గ శాసనసభ్యులు,ఇంచార్జ్ మంత్రి సంతకాలతోని ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తారని ఈ సందర్భంగా తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లు ఇస్తుంది కాబట్టి దళారులకు డబ్బులు ఇవ్వకుండా జాగ్రత్త పడాలని ఈ సందర్భంగా కోరుచున్నాను.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ లాకావత్ ఖండియా, గ్రామ పార్టీ అధ్యక్షుడు జాటోత్ రమేష్, భూక్య శ్రీనివాస్, మిట్ట గడుపుల యాకూబ్, జాటోత్ సంతోష్, భూక్య వెంకన్న, అంగన్వాడి టీచర్ సలీమా పాల్గొన్నారు.

## ఎమ్మార్పీఎస్ జాతీయ సదస్సును విజయవంతం చేయాలి



**కేసముద్రం, మహబూబాబాద్ జిల్లా, ప్రతినిధి, ఆగస్టు. 03, తరంగాలు:**
సెప్టెంబర్ 9న వరంగల్ లో జరుగు ఎమ్మార్పీఎస్, ఎంఎస్పి మండల కమిటీల జాతీయ సదస్సును విజయవంతం చేయడంలో భాగంగా పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ ఆదేశాల మేరకు మహబూబాబాద్ జిల్లా ఇన్చార్జి జన్ను దినేష్ మాదిగ,జిల్లా కో ఇంచార్జి శంకర్ మాదిగ మండలాల పర్యటనలో భాగంగా కేసముద్రం మండలంలోని 16వ వార్డు, చైతన్య నగర్ లో సమీక్షా సమావేశం వలందాస్ రవి ఎమ్మార్పీఎస్ మాజీ మండల అధ్యక్షుడు ఏర్పాటు చేయండి జరిగింది. ఈ కార్యక్రమంలో గుగ్గిళ్ల పీరన్న మాదిగ ఎమ్మెస్ పి జాతీయ నాయకులు, వలందాస్ వినీత్ మాదిగ, కొమ్ము ప్రభు మాదిగ, వలందాస్ ఆనంద్ మాదిగ, పందుల సతీష్ కుమార్ మాదిగ, తదితరులు పాల్గొన్నారు.

### ప్రజావాణి ఫిర్యాదుల పరిష్కారంపై

# జిల్లా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలి





- **జిల్లా కలెక్టర్ బి. చంద్ర శేఖర్**

**నల్గొండ,ఆగస్టు 3,తరంగాలు :**
ప్రజావాణి ఫిర్యాదుల పరిష్కారంపై జిల్లా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ బి. చంద్ర శేఖర్ అన్నారు.సోమవారం కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ జిల్లా అధికారులతో కలిసి ప్రజలవద్ద నుండి పిర్యాదులను స్వీకరించారు.ఫిర్యాదుల స్వీకరణ తర్వాత ఎప్పటిలాగే జిల్లా అధికారులతో వివిధ అంశాల పై జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ముఖ్యమంత్రి కార్యాలయం నుండి వచ్చిన ఫిర్యాదులకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, వీటి పరిష్కారంపై జిల్లా అధికారులు ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని చెప్పారు. అంతేకాక ప్రతి సోమవారం జిల్లా కేంద్రంతో పాటు,మండల, డివిజన్ స్థాయిలలో నిర్వహించే ప్రజావాణి లో వచ్చిన ఫిర్యాదులపై కూడా దృష్టి సారించి పరిష్కారం చేయాలని ఆదేశించారు. మండలాల ప్రత్యేక అధికారులు హాస్టళ్లు, ఇతర ప్రభుత్వ సంస్థలు తనిఖీ చేసిన అనంతరం నివేదికలను తప్పనిసరిగా సమర్పించాలని, కొంతమంది అధికారులు నివేదికలు సమర్పించడం లేదని, ఇకపై తప్పనిసరిగా ప్రతి ఒక్కరు నివేదికలను సమర్పించాలని ఆదేశించారు.ఈ సంవత్సరం నిర్వహించనున్న స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా ముఖ్య అతిథి సందేశానికి ఇప్పటినుండే ఆయా శాఖల అధికారులు నోట్స్ ను తయారుచేసి ఈ నెల 7 లోగా సిపిఓ కు అందజేయాలన్నారు. మంగళవారం నుండి పాఠశాల విద్యార్థులకు బ్లూ యూనిఫామ్ స్టిచ్చింగ్ మొదలు పెట్టాలని తెలిపారు. ప్రభుత్వం నుండి వచ్చిన యూనిఫాంను మండలాలలో వెంటనే హ్యాండ్ఓవర్ చేసుకోవాలని ఆదేశించారు. దిన పత్రికలలో వచ్చే ప్రతికూల వార్తలకు జిల్లా అధికారులందరు స్పందించి వివరణలు ఇవ్వాలని, నివేదికలు తనకు ప్రభుత్వానికి పంపాలని ఆదేశించారు. ఈ సోమవారం రెవెన్యూ శాఖకు 81, ఇతర అధికారులకు 57 ఫిర్యాదులు, మొత్తం 138 వచ్చాయి.ఈ కార్యక్రమం లో రెవెన్యూ ఆధనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్, జెడ్పి సీఈఓ ప్రేమ్ కరణ్ రెడ్డి, శిక్షణ సహాయ కలెక్టర్ శ్రీకాంత్ రెడ్డి, జిల్లా అధికారులు ప్రజల వద్ద నుండి ఫిర్యాదులు స్వీకరించారు.

# మరణానంతరం మహాదానం..

- **తొమ్మిది కుటుంబాలకు ఘన సన్మానం**
- **అవయవదానం మానవత్వానికి నిలువెత్తు నిదర్శనం: కలెక్టర్ బి.చంద్రశేఖర్**




**నల్గొండ ప్రతినిధి , ఆగస్టు 3, తరంగాలు:**
జాతీయ అవయవదాన దినోత్సవాన్ని పురస్కరించుకొని అవయవదానంపై ప్రజల్లో అవగాహన పెంపొందించడంతో పాటు, మరణానంతరం పలువురి జీవితాల్లో వెలుగులు నింపిన అవయవదాతల కుటుంబాలను గౌరవించే ఉద్దేశంతో లయన్స్ క్లబ్ ఆఫ్ నల్గొండ చారిటబుల్ ట్రస్ట్, లయన్స్ క్లబ్ నల్గొండ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ప్రత్యేక సన్మాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ ముందుగా అవయవదాన ప్రతిజ్ఞ పత్రంపై సంతకం చేసి, అవయవదానానికి తన సంపూర్ణ మద్దతును ప్రకటించారు. అనంతరం అవయవదానం ద్వారా పలువురి జీవితాల్లో కొత్త వెలుగులు నింపిన తొమ్మిది మంది అవయవదాతల కుటుంబాలను శాలువాలతో సత్కరించి, ప్రశంసాపత్రాలతో కూడిన ప్రత్యేక ఫోటో ఫ్రేమ్‌లను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. అత్యంత విషాద సమయంలోనూ తమ ప్రియమైన కుటుంబ సభ్యుల అవయవాలను దానం చేసేందుకు అంగీకరించిన కుటుంబాలు నిజమైన మానవతామూర్తులని కొనియాడారు. వ్యక్తిగత దుఃఖాన్ని అధిగమించి, తెలియని వ్యక్తుల జీవితాలను కాపాడేందుకు వారు తీసుకున్న నిర్ణయం సమాజానికి ఆదర్శప్రాయమన్నారు. "అవయవదానం మరణానంతరం కూడా జీవితాలను నిలబెట్టే మహాదానం. ఒక అవయవదాత అనేక మంది జీవితాల్లో కొత్త వెలుగులు నింపగలరు. దాత కుటుంబాలను గౌరవించడం సమాజం యొక్క నైతిక బాధ్యత" అని కలెక్టర్ పేర్కొన్నారు. వారి త్యాగం మరెందరికో అవయవదానానికి స్ఫూర్తిగా నిలుస్తుందని అన్నారు. అర్హులైన దాత కుటుంబాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా సంబంధిత శాఖల అధికారులకు వెంటనే సమాచారం అందించాలని ఆదేశించారు. "ప్రభుత్వం మీకు అండగా ఉంటుంది. మీ కుటుంబ సభ్యులు చేసిన మహోన్నత సేవను సమాజం ఎప్పటికీ గుర్తుంచుకుంటుంది" అంటూ కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. భవిష్యత్తులో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించే నేత్రదానం, అవయవదాన అవగాహన కార్యక్రమాలకు జిల్లా యంత్రాంగం తరఫున పూర్తి సహకారం అందిస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ 320ఈ జిల్లా గవర్నర్ కే.వి. ప్రసాద్, లయన్స్ క్లబ్ అధ్యక్షులు అశోక్ ఎర్రమాద, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎల్.వి. కుమార్, ఐ డొనేషన్ సెంటర్ మేనేజింగ్ డైరెక్టర్ డా. హరనాథ్ కడిమి, కో-ఆర్డినేటర్లు చిరునోముల చంద్రశేఖర్, కోట సరిత, లయన్స్ సభ్యులు, అవయవదాతల కుటుంబ సభ్యులు, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. తమ కుటుంబ సభ్యుల త్యాగానికి ప్రభుత్వం, జిల్లా కలెక్టర్, లయన్స్ క్లబ్ అందించిన గౌరవం తమకు ఎంతో ఆత్మస్థైర్యాన్ని కలిగించిందని అవయవదాతల కుటుంబ సభ్యులు భావోద్వేగంతో తెలిపారు. ఈ సన్మానం తమ జీవితాల్లో మరపురాని అనుభూతిగా నిలిచిపోతుందని పేర్కొంటూ నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు.




## ప్రత్యేక ఓటరు జాబితా సవరణ పారదర్శకంగా పూర్తి చేయాలి

- **జిల్లా కలెక్టర్ అంకింత్**

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బ్యూరో తరంగాలు న్యూస్ ఆగస్టు 3:**
ప్రత్యేక ఓటరు జాబితా సవరణ--2026 కార్యక్రమాన్ని పారదర్శకంగా, ఖచ్చితత్వంతో పూర్తి చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం హైదరాబాద్ నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అంకిత్ పాల్గొన్నారు. ఎస్ఐఆర్ డిజిటలైజేషన్‌ను వేగవంతం చేసి డూప్లికేట్ ఎంట్రీలు, ఫోటో మిస్‌మ్యాచ్‌లు, ఏఎస్‌డీ జాబితాలను క్షుణ్ణంగా పరిశీలించాలని సీఈఓ సూచించారు. బీఎల్‌వోల సంతకాలతో ఎన్యుమరేషన్ ఫారాలు పూర్తి చేయడంతో పాటు,



మరణించిన వారు, శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు మారిన వారు, గుర్తించలేని ఓటర్ల వివరాలను బీఎల్‌ఏల ధృవీకరణతో నవీకరించాలని ఆదేశించారు. 18 ఏళ్లు నిండిన ప్రతి అర్హుడిని ఓటరుగా నమోదు చేయడంతో పాటు, ఒకే కుటుంబ సభ్యుల ఓట్లు ఒకే పోలింగ్ కేంద్రంలో ఉండేలా హేతుబద్ధీకరణ చేపట్టాలని సూచించారు. వీవీఐపీ, వీఐపీ ఓటర్ల మ్యాపింగ్‌ను కూడా పూర్తిస్థాయిలో ధృవీకరించాలని తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటికే 95 శాతం ఎస్ఐఆర్ డిజిటలైజేషన్ పూర్తైందని, మిగిలిన ప్రక్రియను నిర్దేశిత గడువులో పూర్తి చేసి ఎన్నికల సంఘం లక్ష్యాలను సాధించాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో ఎన్నికల సూపరింటెండెంట్ రంగప్రసాద్, ఎన్నికల సిబ్బంది నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ నవ్య వాటర్ పేరుతో సరఫరా చేస్తున్నామంటే నమ్మొద్దు..

- 15 నుంచి తిరిగి డోర్ డెలివరీ సేవలు ప్రారంభం
- 20 లీటర్ల ప్యూరిఫైడ్ వాటర్ క్యాన్ రూ.10కే అందిస్తామని వెల్లడి
- శ్రీ నవ్య వాటర్ పేరుతో సరఫరా చేస్తున్నామంటే నమ్మొద్దు: ప్లాంట్ నిర్వాహకుడు శ్రీధర్



**కేసముద్రం, మహబూబాబాద్ జిల్లా, ప్రతినిధి, ఆగస్టు. 03, తరంగాలు:** గత మూడు నెలలుగా కేసముద్రం స్టేషన్‌లోని శ్రీ నవ్య ప్యూరిఫైడ్ డ్రింకింగ్ వాటర్ ప్లాంట్ నుంచి ఆటోల ద్వారా వాటర్ సరఫరా పూర్తిగా నిలిపివేసినట్లు ప్లాంట్ నిర్వాహకుడు శివారపు శ్రీధర్ తెలిపారు. ప్రస్తుతం తమ ప్లాంట్ నుంచి ఎలాంటి వాటర్ సరఫరా జరగడం లేదని ఆయన స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో ఎవరైనా "శ్రీ నవ్య వాటర్" పేరుతో వాటర్ సరఫరా చేస్తున్నామని చెప్పినా ప్రజలు నమ్మవద్దని, వారికి తమ ప్లాంట్‌తో ఎలాంటి సంబంధం లేదని పేర్కొన్నారు. కొత్త డ్రైవర్లను ఏర్పాటు చేస్తున్నామని, ఈ నెల 10వ తేదీ నుంచి 15వ తేదీ మధ్యలో తిరిగి డోర్ డెలివరీ సేవలను ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఆగస్టు 15వ తేదీ నుంచి నిరంతరాయంగా ఇంటి వద్దకే వాటర్ సరఫరా అందుబాటులో ఉంటుందని వెల్లడించారు. అలాగే, తమ ప్లాంట్ నుంచి 20 లీటర్ల స్వచ్ఛమైన ప్యూరిఫైడ్ డ్రింకింగ్ వాటర్ క్యాన్‌ను కేవలం రూ.10కే అందించనున్నట్లు శ్రీధర్ తెలిపారు. కేసముద్రం మండల ప్రజలు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## తానా మహాసభల్లో ఇల్లంద వాసి గొడిశాల శ్యాంప్రసాద్



**వర్ధన్నపేట ప్రతినిధి, ఆగస్టు 3,తరంగాలు :** అమెరికాలో తెలుగు భాష, సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు వేదికగా నిలుస్తున్న 19వ తానా మహాసభలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఈ ప్రతిష్ఠాత్మక మహాసభలకు ఇల్లంద గ్రామ వాస్తవ్యులు గొడిశాల శ్యాంప్రసాద్ హాజరై వివిధ సాంస్కృతిక, సామాజిక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ప్రపంచ నలుమూలల నుంచి తరలివచ్చిన తెలుగు ప్రముఖులు, ప్రవాస భారతీయులతో కలిసి ఆయన సమావేశాల్లో పాల్గొని తెలుగు భాష, సంస్కృతి అభివృద్ధి, భావితరాలకు తెలుగు సంప్రదాయాలను చేరవేసే అంశాలపై అభిప్రాయాలను పంచుకున్నారు. తానా మహాసభల్లో ప్రముఖుల ప్రసంగాలు, యువజన సదస్సులు, సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. తెలుగు భాష, సంస్కృతి, కళలు, సంప్రదాయాల పరిరక్షణకు సంబంధించిన పలు అంశాలపై చర్చలు జరిగాయి. ఇల్లంద గ్రామానికి చెందిన గొడిశాల శ్యాంప్రసాద్ అంతర్జాతీయ స్థాయిలో నిర్వహిస్తున్న తానా మహాసభలకు హాజరై వివిధ కార్యక్రమాల్లో పాల్గొనడం గ్రామ ప్రజలకు గర్వకారణమని పలువురు అభినందనలు తెలిపారు.

## మచ్చ లేని మహనీయుడు పార్టీ క్రమశిక్షణ కలిగిన నేత -సున్నం రాజయ్య

- జిల్లా కమిటీ సభ్యులు ఎస్.ఏ నబీ



**ఇల్లందు ప్రతినిధి ఆగస్టు 3,( తరంగాలు ):** ప్రజా క్షేమమే తన ధ్యేయంగాభావించి ఎల్లప్పుడూ ప్రజల్లో ఉంటూ పార్టీ క్రమశిక్షణ కలిగిన మహానేత కామ్రేడ్ సున్నం రాజయ్య అని, పార్టీ జిల్లా కమిటీ సభ్యులు ఎస్.ఏ నబీ,మండల కార్యదర్శి ఆలేటి కిరణ్ పేర్కొన్నారు. సున్నం రాజయ్య ఆరో వర్ధంతిని పురస్కరించుకొని పార్టీ కార్యాలయం నందు ఏర్పాటు చేసిన సభ మన్యం మోహన్ రావు అధ్యక్షతన జరగగా, ముందుగా వారి చిత్రపటానికి దండ వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ, మూడు పర్యాయలు భద్రాచలం నియోజకవర్గం ఎమ్మెల్యేగా కొనసాగి ఎటువంటి ప్రలోభాల కు తలోగ్గకుండా అనేక ఉద్యమాలు చేసి భద్రాచలం నియోజకవర్గ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేసాడన్నారు. అటువంటి మహనీయుడిని పార్టీ కోల్పోవడం పార్టీకి తీరని లోటు అని, వారిని ఆదర్శంగా తీసుకుని ప్రతి ఒక్క కార్యకర్త ఉద్యమించాలని అన్నారు. అప్పుడే సున్నం రాజయ్య కి ఘనమైన నివాళులర్పించిన వారం అవుతామని వారు పార్టీ కార్యకర్తలకు సూచించారు. ఈ కార్యక్రమంలోపార్టీ మండల కమిటీ సభ్యులు ఎస్కే ఖాదర్, పార్టీ సభ్యులు కోటమ్మ భవాని, వెంకటేశ్వర్లు, నయీమ్, సలీమా, వీరయ్య, నస్రీన్ తదితరులు పాల్గొన్నారు.



### మొక్కజొన్న కొనుగోలు అవకతవకలపై

# కలెక్టర్‌ను కలవనున్న ఆదివాసి సంఘాలు

- ఇల్లందు, చల్ల సముద్రం, కోమారారం మొక్కజొన్న రైతులను మోసగించిన వ్యవసాయ సహకార సంఘం
- రైతుల నుండి అతి తక్కువకు కొనుగోలు చేసి అధిక ధరలకు విక్రయించిన వైనం




**ఇల్లందు ప్రతినిది ఆగస్టు 3, ( తరంగాలు):** ఇల్లందు మండలంలో మొక్కజొన్న కొనుగోలు విషయంలో జరిగిన అవకతవకలపై ఆదివాసి సంక్షేమ పరిషత్ ఇల్లందు మండల కమిటీ, అత్యవసర సమావేశం నిర్వహించింది. ఈ యొక్క సమావేశంలో ఆదివాసి సంక్షేమ పరిషత్ ఇల్లందు మండల అధ్యక్షులు చింత ఉపేందర్ పాల్గొని మాట్లాడుతూ, ఇల్లందు మండల పరిధిలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పిఎసిఎస్) ఇల్లందు, చల్ల సముద్రం, కొమరారం పరిధిలో గల కేంద్రాలలో, ఖరీఫ్ సీజన్ కు సంబంధించిన మొక్కజొన్నల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి, కొనుగోలు చేయడం జరిగినదని తెలిపారు. ఈ కేంద్రాలలో అకాల వర్షాలతో మొక్కజొన్నలు తడవగా ప్రతి గింజను కేంద్రాల ద్వారా కొనుగోలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం చూయించినప్పటికీ, ఇల్లందు మండల పరిధి కేంద్రాలలో మాత్రం దీనికి పూర్తి విరుద్ధంగా నడుచుకుందని వారు విమర్శించారు. ఈ యొక్క కేంద్రాలలో మొక్కజొన్న అమ్మిన రైతులకు కేంద్రంలో పనిచేస్తున్న కొంతమంది వ్యక్తులు ఆ రైతులకు మొత్తం డబ్బులు చెల్లించకుండా,మొక్కజొన్న తడిసిందనే సాకుతో రైతులకు మాయ మాటలు చెప్పి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ( పిఎసిఎస్ ) ఇల్లందు ఒక్కొక్క రైతుకు రూ 4000/- నుండి 30 వేల వరకు రైతులను మోసగించినట్లు అనేక ఆరోపణలు ఉన్నట్లు తెలపడం గమనర్హం. రైతుల వద్ద నుండి అతి తక్కువకు కొనుగోలు చేసి అధిక ధరలకు విక్రయించినట్లు బహిర్గతం కావడంతో కొంతమంది రైతులను కలిసి గుట్టు చప్పుడు కాకుండా కొంత ధనాన్ని రైతులకు ముట్ట చెబుతున్నట్లు ప్రచారం. మొక్కజొన్న కొనుగోలును అడ్డుపెట్టుకొని ఎంత దోచారనే విషయంపై ప్రత్యేక విచారణ చేపట్టాలని, ఖరీఫ్ సీజన్లో అకాల వర్షాలకు విత్తనాలు తడిసిన రైతులకు చెల్లించాల్సిన మొత్తం డబ్బులను చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదివాసి సంక్షేమ పరిషత్ డిమాండ్ చేస్తుంది అన్నారు. ఇట్టి విషయం పైన ఇల్లందు మండల పరిధిలోని నష్టపోయిన రైతులందరినీ జిల్లా కలెక్టర్ ముందు కు తీసుకెళ్తున్నట్లు వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గోవర్ధన్, ఇల్లందు మండల ఉపాధ్యక్షులు ఈసాల రామచంద్రు, ప్రధాన కార్యదర్శి కిన్నెర కిషోర్, రాకేష్, కల్తీ రవీందర్ మొదలగువారు పాల్గొనడం జరిగిందని ఓ ప్రకటనలో తెలిపారు.




# కేసముద్రం లోని గుడుంబా కేంద్రాలపై దాడులు

- పలువురుపై కేసులు నమోదు.. ఏడుగురు బైండోవర్

**కేసముద్రం,మహబూబాబాద్ జిల్లా, ప్రతినిధి, ఆగస్టు. 03, తరంగాలు:** గూడూరు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని కేసముద్రం మండలం గిర్ని తండ, ఎన్టీఆర్ నగర్,కట్టుకాలువ తండ, బ్రహ్మంగారి గుడి తండ, కొత్తూరు మరియు ఇనుగుర్తి మండలం లాలు తండ లలోని నాటు సారాయి కేంద్రాలపై దాడులు నిర్వహించడం జరిగింది. ఈ దాడులలో తొమ్మిది కేసు నమోదు చేసి, తొమ్మిది మందిని అదుపులోకి తీసుకోవటం జరిగింది, 30 లీటర్ల నాటు సారాను, 20 కిలోల బెల్లం, 5 కిలోల పటిక ను స్వాధీనం చేసుకోవటం జరిగింది అలాగే 1100 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేయటం జరిగింది. బానోత్ సరస్వతి,ఆంగోత్ విజయ భానోత్ బద్రి, భానోత్ బద్రి, నూనె ముత్తమ్మ, జాటోత్ బంగారి, బానోతుగాయి, వాంకుడోత్ సోనీ, మరియు భానోత్ సునీత లపై కేసు నమోదు చేసి ఏడుగురిని కేసముద్రం తాహసిల్దారు గారి ఎదుట బైండోవర్ చేయడం జరిగిందని ఎక్సైజ్ గూడూర్ సీఐ బిక్షపతి తెలిపారు. ఈ దాడులలో ఎన్ఫోర్స్మెంట్ ఇన్స్పెక్టర్లు నాగయ్య, చంద్రశేఖర్,డిస్ట్రిక్ట్ టాస్క్ ఫోర్స్ మహబూబాద్ ఇన్స్పెక్టర్ నీరజ,ఎస్సై కిరీటి,గూడూరు స్టేషన్ ఇన్స్పెక్టర్ ఎన్ బిక్షపతి ఎస్సై ఎస్ రాజేశ్వరి,ట్రైని ఎస్సై ఎస్ సంతోష్ అలాగే కాజీపేట స్టేషన్ ఎస్ఐ తిరుపతి మరియు సిబ్బంది పాల్గొన్నారూ. ఈ సందర్భంగా సిఐ బిక్షపతి మాట్లాడుతూ నాటు సారా కేంద్రాలపై నాటు సారా ముడి సరుకు రవాణా దారులపై నిఘా పెంచామని, నాటు సారా తయారుచేసిన, అమ్మిన, కొనినా, రవాణా చేసిన, నాటు సారా తయారీకి ఉపయోగించు ముడి పదార్థాలైన బెల్లం, పట్టిక, నాటు సారా తయారీకి వాడే చెక్కర మరియు ఈస్టులను కూడా అక్రమంగా రవాణా చేసిన నిలువ చేసిన చట్ట పరంగా చర్యలు తీసుకోబడతాయని తెలిపారు. అధికారులు విస్తృతంగా దాడులు నిర్వహించనున్నామని, చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోనున్నామని ఈ సందర్భంగా గూడూరు ఎక్సైజ్ సీఐఎస్. బిక్షపతి తెలిపారు.





# ప్రపంచ తల్లి పాల వారోత్సవాలు



**జఫర్గడ్ ప్రతినిధి,ఆగస్టు 3, (తరంగాలు):** మండలంలోని రఘునాథ్ పల్లి గ్రామంలో తల్లిపాల వారోత్సవంలో యుపిఎస్ ఆవరణంలో ఉన్న అంగన్వాడి 1 2 కేంద్రాలను సర్పంచ్ ఎడ్ల వెంకటయ్య సూపర్వైజర్ ఎస్ అనిత ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తల్లిపాలు ప్రాముఖ్యత, ముప్పులు తొలగించడం, అవగాహన పెంపొందించడం ఆగస్టు 1 నుండి ఆగస్టు 7 వరకు. మొదటి టీకా: బిడ్డ పుట్టిన గంటలోపు తల్లిపాలు పట్టాలి. ఆరు నెలలు బిడ్డకు ఆరు నెలలు నిండే వరకు కేవలం తల్లిపాలు మాత్రమే ఇవ్వాలి. తల్లిపాల లాభాలుపుట్టిన గంటలోపు పాలు ఇస్తే శిశువులో రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. మొదటి ఆరు నెలల పాటు ఎదుగుదలకు కావలసిన అన్ని పోషకాలు తల్లిపాలలోనే ఉంటాయి. ఆరోగ్యకరమైన చిన్నారులే ఆరోగ్యకరమైన సమాజానికి పునాది అని అన్నారు. ఆసుపత్రికి వెళ్లడానికి ఏమైనా ఇబ్బంది ఉంటే నా సొంత వాహనాన్ని కూడా వాడుకోవచ్చు అని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఎట్ల వెంకటయ్య సూపర్వైజర్స్ అనిత, వార్డ్ నెంబర్లు అరుణ గణేష్ ఉపాధ్యాయులు శ్రీనివాస్ వెంకటేశ్వర్లు సరస్వతి రంగారావు టీచర్లు ఆశా వర్కర్ తదితరులు పాల్గొన్నారు.

## 65 ఏళ్ల విద్యా సేవకు నిదర్శనం బ్లూ సఫైర్ జూబ్లీ వేడుకలు జరుపుకున్న శివశివాని గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్




**కుత్బుల్లాపూర్ 03 ఆగస్టు ( తరంగాలు )**

కుత్బుల్లాపూర్ నియోజక వర్గం

విద్యారంగంలో 65 సంవత్సరాల విశిష్ట సేవలను పూర్తి చేసుకున్న శివశివాని గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్ (ఎస్ఎస్‌జీఐ) తన బ్లూ సఫైర్ జూబ్లీ (1961--2026) వేడుకలను ఆగస్టు 3 ఘనంగా నిర్వహించింది. విద్యా నాణ్యత, విలువల ఆధారిత బోధన, నాయకత్వ వికాసం, సమాజ సేవలో ఆరు దశాబ్దాలకు పైగా అందించిన విశేష సేవలకు గుర్తింపుగా ఈ వేడుకలు నిర్వహిస్తున్నట్లు సంస్థ ప్రెసిడెంట్ ఆర్తి సంపతి, తెలిపారు. ఈ చారిత్రాత్మక వేడుకల్లో దేశానికి సేవ, నాయకత్వం యువతకు స్ఫూర్తినిచ్చే ఇద్దరు ప్రముఖులు పాల్గొననున్నారు. వారు కూడా శివ శివాని సంస్థ విద్యార్థులు గర్వ కారణం అని సంస్థ ప్రెసిడెంట్ ఆర్తి సంపతి, తెలిపారు భారత సైన్యంలో విశిష్ట సేవలందించిన కల్నల్ గౌరవ్ దత్తా (విరమణ పొందిన) ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. యుద్ధభూమిలో అసాధారణ ధైర్యసాహసాలు ప్రదర్శించిన కల్నల్ గౌరవ్ దత్తా (రిటైర్డ్) ట్రైయాథ్లాన్ ఛాంపియన్‌గా కూడా దేశవ్యాప్తంగా గుర్తింపు పొందారు. ముఖ్య అతిథి కల్నల్ గౌరవ్ దత్తా (రిటైర్డ్) మాట్లాడుతూ, "శివశివాని నా జీవితంలో ఒక విద్యాసంస్థ మాత్రమే కాదు, వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దిన ఆలయం. సైన్యంలో నేర్చుకున్న ధైర్యం, నాయకత్వం, క్రమశిక్షణకు ఇక్కడ పొందిన విలువలే బలమైన పునాది.

నేటి విద్యార్థులు సవాళ్లను అవకాశాలుగా మార్చుకుంటూ దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలి" అని పిలుపునిచ్చారు. క్రమశిక్షణ, ధైర్యం, పట్టుదలతో కూడిన ఆయన జీవితం యువతకు స్ఫూర్తిదాయకమని అయన పేర్కొన్నారు. విద్యా సంస్థ ప్రెసిడెంట్ అండ్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆరతి సంపతి మాట్లాడుతూ, గత 65 సంవత్సరాలుగా శివశివాని గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్ వేలాది మంది విద్యార్థులను విద్య, విలువలు, నాయకత్వ లక్షణాలతో తీర్చిదిద్ది దేశ విదేశాల్లో వివిధ రంగాల్లో రాణించేలా తీర్చిదిద్దిందని తెలిపారు. పాఠశాల విద్య నుంచి ఉన్నత, వృత్తిపరమైన విద్య వరకు నాణ్యమైన విద్యను అందిస్తూ సంస్థ విశిష్ట గుర్తింపు పొందిందన్నారు. గత ఆరు దశాబ్దాలుగా శివశివాని గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్ విద్యార్థుల్లో విద్యా ప్రావీణ్యం, నైతిక విలువలు, నాయకత్వ లక్షణాలు, ఆవిష్కరణాత్మక దృక్పథం సమగ్ర వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందిస్తూ వేలాది మంది విజయవంతమైన పూర్వ విద్యార్థులను సమాజానికి అందించింది అని అన్నారు. విద్యా సంస్థ వైస్ ప్రెసిడెంట్ డా. శైలేష్ సంపతి మాట్లాడుతూ, భవిష్యత్తులో కూడా ప్రపంచ స్థాయి విద్య, విలువలతో కూడిన నాయకత్వం, ఆవిష్కరణలకు ప్రాధాన్యం ఇస్తూ సమాజానికి బాధ్యతాయుతమైన పౌరులను తీర్చిదిద్దేందుకు శివశివాని గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్ కట్టుబడి ఉందని తెలిపారు. తల్లిదండ్రులు, విద్యార్థులు, పూర్వ విద్యార్థులు సంస్థపై ఉంచిన అపారమైన విశ్వాసం, ఆదరణతో నేడు శివశివాని గ్రూప్ ఒకే క్యాంపస్‌లో రెండు డిగ్రీ కళాశాలలు, ఒక పాఠశాల, ఒక జూనియర్ కళాశాల (ఇంటర్), అలాగే మేనేజ్‌మెంట్ విద్యాసంస్థలను విజయవంతంగా నిర్వహిస్తోందని పేర్కొన్నారు. కేజీ నుంచి పీహెచ్‌డీ వరకు సమగ్ర విద్యను అందిస్తున్న అరుదైన విద్యాసంస్థల్లో శివశివాని ఒకటిగా నిలిచిందని ఆయన తెలిపారు. విద్యా సంస్థ అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ దీపికా సంపతి మాట్లాడుతూ, 1961లో స్థాపితమైన శివశివాని గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్ గత 65 సంవత్సరాలుగా "లెర్న్ టు సర్వ్ " (నేర్చుకొని సేవ చేయండి) అనే ఆదర్శ వాక్యంతో విద్యా సేవను అందిస్తోందని చెప్పారు. పాఠశాల విద్య నుంచి డిగ్రీ, పీజీ, మేనేజ్‌మెంట్, ఇతర వృత్తిపరమైన విద్యా కార్యక్రమాలను అత్యున్నత ప్రమాణాలతో నిర్వహిస్తూ, నాణ్యమైన విద్యతో పాటు నైతిక విలువలు, సామాజిక బాధ్యత, నాయకత్వ లక్షణాలను విద్యార్థుల్లో పెంపొందిస్తున్నామని తెలిపారు. విద్య, విలువలు, సమాజ సేవ అనే మూడు ప్రధాన సూత్రాలతో శివశివాని దేశంలోని ప్రముఖ విద్యాసంస్థగా గుర్తింపు పొందిందని ఆమె పేర్కొన్నారు. బ్లూ సఫైర్ జూబ్లీ వేడుకల్లో వివిధ విభాగాల అధిపతులు, విద్యార్థులు, పూర్వ విద్యార్థులు, అధ్యాపకులు, పరిశ్రమల ప్రముఖులు, విశిష్ట అతిథులు, పాల్గొని సంస్థ వ్యవస్థాపకుల దూరదృష్టిని స్మరించుకున్నారు.

"సర్వీంగ్ ది చౌసె అఫ్ ఎడ్యుకేషన్ " (విద్యా సేవే మా ధ్యేయం) అనే సందేశంతో నిర్వహిస్తున్న ఈ వేడుకలు సంస్థ 65 ఏళ్ల విద్యా ప్రస్థానాన్ని ప్రతిబింబించారు శివశివాని గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్ గురించి 1961లో స్కూల్ తో స్థాపితమైన శివశివాని గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్ ( ఎస్ ఎస్ జి ఐ ), నేడు దేశంలోని ప్రముఖ విద్యాసంస్థల్లో ఒకటిగా గుర్తింపు పొందింది. పాఠశాల విద్య నుంచి డిగ్రీ, పీజీ, మేనేజ్‌మెంట్ ఇతర వృత్తిపరమైన విద్యా కార్యక్రమాల వరకు నాణ్యమైన విద్యను అందిస్తూ, విద్యా రంగంలో విశిష్ట సేవలను అందిస్తోంది. "లెర్న్ టు సర్వ్ " (నేర్చుకొని సేవ చేయండి) అనే ఆదర్శ వాక్యాన్ని మార్గదర్శకంగా తీసుకుని, విద్యా ప్రావీణ్యం, ఆవిష్కరణలు, నాయకత్వ లక్షణాలు, నైతిక విలువలు సమాజ సేవా దృక్పథాన్ని విద్యార్థుల్లో పెంపొందిస్తూ తరతరాలకు స్ఫూర్తినిస్తోంది. అన్నారు ప్రస్తుతం కిండర్ గార్టెన్ (కేజీ ) నుంచి పీహెచ్‌డీ వరకు సమగ్ర విద్యా అవకాశాలను అందిస్తున్న అరుదైన విద్యాసంస్థల్లో శివశివాని ఒకటిగా నిలిచింది. భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా ప్రపంచ స్థాయి నైపుణ్యాలు కలిగిన వృత్తి నిపుణులు, నైతిక విలువలతో కూడిన నాయకులు, బాధ్యతాయుతమైన ప్రపంచ పౌరులను తీర్చిదిద్దడమే లక్ష్యంగా సంస్థ తన విద్యా సేవలను మరింత విస్తరించుకుంటూ సమాజాభివృద్ధికి విశిష్ట సేవలందిస్తోంది. అని అన్నారు.



# తల్లిపాలే బిడ్డకు మొదటి టీకా



**ఇల్లందు ప్రతి నిధి ఆగస్టు 3, ( తరంగాలు) :**

పిల్లల సంపూర్ణ ఆరోగ్యానికి, మానసిక-శారీరక ఎదుగుదలకు తల్లిపాలే అత్యంత శ్రేయస్కరమని 22వ వార్డ్ కౌన్సిలర్ కోర్లపాటి శివకిరణ్ అన్నారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా సోమవారం ఇల్లందు పట్టణంలోని వినోబాభావే కాలనీలోని అంగన్వాడి కేంద్రంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ మాట్లాడుతూ, అప్పుడే పుట్టిన బిడ్డకు గంటలోపే తల్లి ముర్రుపాలు తాగించాలి. దీనినే లిక్విడ్ గోల్డ్ అంటారు. ఇందులో ఉండే రోగనిరోధక శక్తి బిడ్డకు జీవితాంతం రక్షణ కవచంలా ఉంటుంది. పసిపిల్లల్లో ఇన్ఫెక్షన్లు, విరేచనాలు రాకుండా కాపాడుతుంది అని తెలిపారు. పుట్టిన 6 నెలల వరకు బిడ్డకు కేవలం తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని, ఆ తర్వాత 2 సంవత్సరాల వరకు తల్లిపాలతో పాటు అనుబంధ ఆహారం అందించాలని సూచించారు.అంగన్వాడి కేంద్రాల ద్వారా పంపిణీ చేస్తున్న బాలామృతం, చిక్కీల ప్రాముఖ్యతను ఆయన వివరించారు. ఈ చిక్కీలలో ఇనుము, ప్రోటీన్, క్యాల్షియం, విటమిన్-ఏ, విటమిన్-బి1 పుష్కలంగా ఉంటాయి. వీటిని క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల పిల్లల్లో రక్తహీనత, బలహీనత రాకుండా ఉంటాయి. బరువు, ఎత్తు సరిగా పెరుగుతాయి" అన్నారు. గర్భిణులు, బాలింతల సంక్షేమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని చెప్పారు. ప్రతి నెలా ప్రతి గర్భిణి, బాలింతకు 16 గుడ్లు ఉచితంగా అందజేస్తు న్నాం. అలాగే ప్రతి బుధ, శుక్రవారాల్లో ఆకుకూరలతో కూడిన వేడి వేడి భోజనం వడ్డిస్తున్నాం. దీనివల్ల తల్లి, బిడ్డ ఇద్దరూ ఆరోగ్యంగా ఉంటారు అని పేర్కొన్నారు. 3 నుంచి 5 సంవత్సరాల పిల్లలను తప్పనిసరిగా అంగన్వాడి పాఠశాలలో చేర్పించాలి. అక్కడ ఉచిత విద్యతో పాటు పోషకాహారం, ఆరోగ్య పరీక్షలు కూడా అందుతాయి" అని తల్లిదండ్రులకు పిలుపుని చ్చారు. అనంతరం నూతనంగా ఎన్నుకోబడిన కౌన్సిలర్ కొర్లపాటి శివకిరణ్ ను పుష్పగుచ్ఛంతో, శాలువాతో ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్లు మిట్ట గడుపుల యాకమ్మ, ఆలేటి సంధ్య ,హెల్పర్ దేవులపల్లి సోమలక్ష్మి, ఆశ వర్కర్ సిహెచ్. రేణుక తదితరులు పాల్గొన్నారు.

# తల్లిపాలే శిశువుకు అమృతధార..!



- తొలి గంటలోనే తల్లిపాలు పట్టించాలి
- అంగన్వాడీ సూపర్‌వైజర్ చంద్రకళ
- కట్ర్యాల అంగన్వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు

**వర్ధన్నపేట ప్రతినిధి , ఆగస్టు 3, తరంగాలు :**

తల్లిపాలే శిశువుకు అమృతధార అని, తొలి గంటలోనే శిశువుకు తల్లిపాలు పట్టించాలని అంగన్వాడీ సూపర్‌వైజర్ చంద్రకళ అన్నారు. వరంగల్ జిల్లా వర్ధన్నపేట ప్రాజెక్టు ఇల్లంద సెక్టార్ పరిధిలోని కట్ర్యాల గ్రామ అంగన్వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాల కార్యక్రమం గ్రామ సర్పంచ్ రమ అధ్యక్షతన అంగన్వాడీ సూపర్‌వైజర్ చంద్రకళ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమానికి గర్భిణీలు, బాలింతలు హాజరయ్యారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ చంద్రకళ మాట్లాడుతూ.. శిశువు జన్మించిన గంటలోపే తల్లిపాలు పట్టించడం ద్వారా వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని తెలిపారు. శిశువు పుట్టిన మొదటి ఆరు నెలల వరకు కేవలం తల్లిపాలనే అందించాలని, ఆ తర్వాత అనుబంధ ఆహారంతో పాటు రెండేళ్ల వరకు తల్లిపాలను కొనసాగించాలని సూచించారు. తల్లిపాలు శిశువుకు సంపూర్ణ పోషకాహారంతో పాటు సహజ రక్షణను అందించే అమృతధారలాంటివని ఆమె పేర్కొన్నారు. తల్లిపాలు తీసుకునే పిల్లల్లో శారీరక ఎదుగుదల, మెదడు అభివృద్ధి మెరుగ్గా ఉండటంతో పాటు న్యూమోనియా వంటి పలు అనారోగ్యాల నుంచి రక్షణ పొందేందుకు దోహదపడతాయని వివరించారు. బాలింతలు కూడా తమ ఆరోగ్యంపై శ్రద్ధ వహిస్తూ పోషక విలువలు కలిగిన సమతుల్య ఆహారం తీసుకోవాలని, తగినంత నీరు తాగాలని సూచించారు. తల్లి ఆరోగ్యంగా ఉంటే శిశువుకు తగినంత తల్లిపాలు అందించగలుగుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ సిబ్బంది, గర్భిణీలు, బాలింతలు తదితరులు పాల్గొన్నారు.



### ప్రెస్ క్లబ్‌లో పారదర్శకత ఏది..?..

# రూ.5 లక్షల భవన నిధులపై తేలని మిస్టరీ..!

- ఐదుగురుతో వేసిన కమిటీ చెల్లుబాటు కావు....

**సంగెం ఆగస్టు 3 తరంగాలు**

మండల కేంద్రంలోని జర్నలిస్టుల భవన నిర్మాణ నిధులపై పారదర్శకత లోపించిందని, గత బి ఆర్ ఎస్ ప్రభుత్వంలో మంజూరైన రూ. 5 లక్షల నిధుల లెక్కలు తేల్చకుండా గుట్టుచప్పుడు కాకుండా 'డుబు కమిటీలు' వేసుకోవడాన్ని సంగెం సీనియర్ పాత్రికేయులు తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు మండల కేంద్రంలోని విలేకరుల సమావేశ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీనియర్ విలేకరులు మాట్లాడుతూ... గత ప్రభుత్వ హయాంలో జర్నలిస్టుల భవన నిర్మాణం కోసం రూ. 5 లక్షల నిధులు మంజూరయ్యాయని, అలాగే పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు, దాతలు, కూడా విరాళాలు ఇచ్చారని గుర్తుచేశారు. ఏళ్లు గడుస్తున్నా భవన నిర్మాణం అసంపూర్తిగానే మిగిలిపోయిందని, ఆ నిధులు ఎటు వెళ్లాయో, ఎవరి ఖాతాల్లోకి చేరాయో ఇప్పటివరకు స్పష్టత లేదని ఆరోపించారు. నిధుల లెక్కలు అడుగుతుంటే సమాధానం చెప్పలేక, రాత్రికి రాత్రే సీనియర్లను విస్మరిస్తూ అనధికారికంగా ఐదుగురు విలేకరులతో ప్రెస్ క్లబ్ కమిటీలను ప్రకటించుకోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు.

**ఏకపక్ష కమిటీలు చెల్లవు:**



సుదీర్ఘకాలంగా మండలంలో పాత్రికేయ రంగానికి సేవలు అందిస్తున్న పలువురి విలేకరులను భాగస్వామ్యం చేయకుండా, కనీస సమాచారం ఇవ్వకుండా వేసుకున్న, డుబు కమిటీల'కు ఎలాంటి చెల్లుబాటు లేదని స్పష్టం చేశారు. ప్రెస్ క్లబ్ అనేది మండలంలోని విలేకరులందరి ఉమ్మడి ఆస్తి అని, దానిని కొద్దిమంది స్వప్రయోజనాల కోసం, వ్యాపార వేదికగా మలుచుకోవాలని చూస్తే చూస్తూ ఊరుకోబోమని తీవ్రస్థాయిలో హెచ్చరించారు.

**కలెక్టర్ విచారణకు డిమాండ్:**

భవన నిర్మాణ నిధుల దుర్వినియోగంపై జిల్లా కలెక్టర్, సంబంధిత అధికారులు సమగ్ర విచారణ జరిపించి నిజానిజాలు బయటపెట్టాలని డిమాండ్ చేశారు. నిధులపై శ్వేతపత్రం విడుదల చేసే వరకు, అందరినీ భాగస్వాములను చేస్తూ ప్రజాస్వామ్యబద్ధంగా కమిటీని ఎన్నుకునే వరకు తమ పోరాటం ఆగేది లేదని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో పాత్రికేయులు, మచ్చిక వెంకటేశేశ్వర్లు (ఆంధ్రప్రభ), గాయపు రాజిరెడ్డి(నవ తెలంగాణ), వేల్పుల అనిల్ యాదవ్ (ప్రజాజ్యోతి), సధిరం కుమారస్వామి (తరంగాలు), మచ్చిక విరస్వామీ (సూర్య), బాషీపాక రాములు(మనం ప్రజలు), సిద్ధ నాగరాజు (నిఘా), మండ వేణు (ప్రజాపక్షం), మందపురి బలరాం(తెలంగాణ గళం), హరి (ఎబి న్యూస్), ఏలీయా (ప్రభంజనపదం), పాల్గొన్నారు.

## తల్లిపాలే పిల్లల క్షేమం

**జఫర్గడ్ ప్రతినిధి, ఆగస్టు 3,(తరంగాలు):**

మండలంలోని తిమ్మాపురం గ్రామంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించడం జరిగినది ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథి గా సర్పంచ్ పులి సమ్మయ్య హాజరు అయ్యారు. ఈ సందర్భంగా సర్పంచ్ పులి సమ్మయ్య, ఐసిడిఎస్ సూపర్వైజర్ అనిత మాట్లాడుతూ తల్లిపాల తాగించడం వలన బిడ్డకి కలిగే ప్రయోజనాలు పుట్టగానే తల్లిపాలు పట్టడం వలన బిడ్డకి మొదటి టీకా లా పనిచేస్తుంది 6 నెలలు కేవలం తల్లిపాలు మాత్రమే పట్టించాలి.తల్లిపాలతో పాటు 7 నేలనుండి అనుబంధ ఆహారం మొదలు పెట్టాలి. 2 సంవత్సరాలు తల్లి పాలు కొనసాగించాలి గర్భిణీ స్త్రీలు సంపూర్ణ పౌష్టికాహారం తీసుకోవాలని తెలియచేయడం జరిగినది ఈ కార్యక్రమానికి అంగన్వాడీ టీచర్స్ సరిత, యాదమ్మ ,వార్డు నంబర్ రాజు, పంచాయతీ కార్యదర్శి మోహన్, తల్లితండ్రులు, ఆశావర్కర్ అనిత పాల్గొనడం జరిగింది.



THARANGALU DAILY NEWS
మంగళవారం, 04 ఆగస్టు, 2026
జాతీయ దిన పత్రిక
తరంగాలు

# కేసముద్రంలో కదం తొక్కిన గీతన్నలు!



- వేలాది మంది గౌడన్నల గర్జన.. జనసంద్రంగా "గీతన్నల చైతన్య యాత్ర"
- కేజీ కేఎస్ రాష్ట్ర బృందానికి గజమాలతో ఘన స్వాగతం పలికిన గోపా డివిజన్ అధ్యక్షులు చిలువేరు సమ్మయ్య గౌడ్
- గీత అన్నలకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలి
- రాష్ట్ర అధ్యక్షులు రమణ, ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు
- 1200 బైక్‌లు.. 2,000 మందికి పైగా గీత కార్మికులు, యువతతో భారీ ర్యాలీ
- ఎక్స్‌గ్రేషియా రూ.10 లక్షలకు పెంచాలి..
- పెండింగ్ బకాయిలు వెంటనే విడుదల చేయాలి
- కేజీ కేఎస్ రమణ ప్రతిపాదించిన డిమాండ్లను వేం నరేందర్ రెడ్డి దృష్టికి తీసుకెళ్తా - సమ్మయ్య గౌడ్

కేసముద్రం, ఆగస్టు 3, తరంగాలు ప్రతినిధి :

గీత కార్మికుల హక్కులు, సంక్షేమం, సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన "అమరుల యాదిలో.. గీతన్నల చైతన్య యాత్ర" కేసముద్రంలో సోమవారం హోరెత్తింది. మహబూబాబాద్ జిల్లాలో సోమవారం ప్రారంభమైన చైతన్య యాత్రలో భాగంగా నిర్వహించిన భారీ బైక్ ర్యాలీకి మండలంలోని దాదాపు అన్ని గ్రామాల నుంచి గౌడన్నలు, గీత కార్మికులు, యువత భారీగా తరలివచ్చారు. సుమారు 1200 ద్విచక్ర వాహనాలు, 2,000 మందికి పైగా పాల్గొనడంతో కేసముద్రం జనసంద్రంగా మారింది.

గజమాలతో ఘన స్వాగతం పలికిన అనంతరం బైక్ ర్యాలీ ప్రారంభమైంది. ఫ్లైఓవర్ మీదుగా అంబేద్కర్ సెంటర్‌కు చేరుకున్న ర్యాలీ అక్కడ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి, అనంతరం జ్యోతిరావు ఫూలే సెంటర్‌లో మహాత్మా జ్యోతిరావు ఫూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించింది.

## ప్రభుత్వం వెంటనే స్పందించాలి

రాష్ట్ర అధ్యక్షులు ఎంవీ రమణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గీత కార్మికుల సమస్యలను గ్రామస్థాయి నుంచి తెలుసుకుని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకే ఈ చైతన్య యాత్ర చేపట్టినట్లు తెలిపారు. గీత కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని, వారి సంక్షేమానికి తక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

## గీతన్నల ప్రధాన డిమాండ్లు ఇవే..

ఎక్స్‌గ్రేషియాను రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచాలి.

ప్రమాదవశాత్తు మృతి చెందిన గీత కార్మికుల కుటుంబాలకు పెండింగ్ ఎక్స్‌గ్రేషియా బకాయిలు వెంటనే చెల్లించాలి.

తాటి, ఈత చెట్లు ఎక్కడానికి రక్షణ కిట్లు, భద్రతా పరికరాలు పూర్తిస్థాయిలో అందించాలి.

జనగామ జిల్లాకు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ పేరు పెట్టాలి.

ప్రమాదాలకు గురయ్యే గీత కార్మికులకు మెరుగైన భద్రతా సౌకర్యాలు, కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించాలి.

హైదరాబాద్ ట్యాంక్‌బండ్‌పై సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహాన్ని వెంటనే ఏర్పాటు చేయాలి.

## గీతన్నలకు అండగా ఉంటా-గోపా డివిజన్ అధ్యక్షులు చిలువేరు సమ్మయ్య గౌడ్


గీత కార్మికుల హక్కులు, సంక్షేమం, సమస్యల పరిష్కారం కోసం కేజీకేఎస్ రాష్ట్ర నాయకత్వం ప్రతిపాదించిన డిమాండ్లకు తన పూర్తి మద్దతు ఉంటుందని గోపా డివిజన్ అధ్యక్షులు చిలువేరు సమ్మయ్య గౌడ్‌తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ భూక్యా మురళి నాయక్, మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాం నాయక్, డీసీసీ అధ్యక్షురాలు ఉమా మురళి నాయక్ సహకారంతో కేసముద్రం గడ్డ ముద్దుబిడ్డ, రాజ్యసభ సభ్యులు వేం నరేందర్ రెడ్డి దృష్టికి సమస్యలను తీసుకెళ్లి, వారి ద్వారా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో గీత కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.




కార్మికులు, యువత, వివిధ సంఘాల ప్రతినిధులు ఐక్యంగా ముందుకు సాగాలని, ఐక్యతతోనే హక్కులు సాధించుకోగలమని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు గౌని వెంకన్న, రాష్ట్ర ఉపాధ్యక్షులు, కార్యవర్గ సభ్యులు బన్నీ వెంకట మల్లయ్య, వి. వెంకట నరసయ్య, గౌని సాంబయ్య, చౌగాని సీతారాములు, ఎస్. రమేష్ గౌడ్, ఎస్. వెంకట్ గౌడ్, యమగాని వెంకన్న, గోడం వెంకటేశ్వర్లు, పానుగంటి వీరస్వామి, బుర్ర సుధాకర్, తాళ్లపల్లి నర్సయ్య, బాలబోయిన





## గీతన్నల హక్కుల కోసం గళమెత్తిన నేతలు

కేజీకేఎస్ మండల అధ్యక్షులు బబ్బూరి ఉప్పలయ్య, కార్యదర్శి మేడం వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో, గోపా డివిజన్ అధ్యక్షులు చిలువేరు సమ్మయ్య గౌడ్ అధ్యక్షతన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద కేజీకేఎస్ రాష్ట్ర బృందానికి

గౌడ సమాజం విద్య, ఉద్యోగాలు, వ్యాపారం, రాజకీయాలు, ఆర్థిక రంగాల్లో సమగ్రంగా అభివృద్ధి చెందాల్సిన అవసరం ఉందన్నారు. పిల్లలకు మెరుగైన విద్య, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించి గౌడ కుటుంబాలు ఆర్థికంగా బలోపేతం కావాలని ఆకాంక్షించారు. రాజకీయాలకు అతీతంగా గీత

రాంబాబు, రాష్ట్ర సోషల్ మీడియా కన్వీనర్ రాజేష్తో పాటు మండలంలోని వివిధ గ్రామాల నాయకులు, గౌడ యువజన నాయకులు, గీత కార్మికులు, గౌడ సంఘాల ప్రతినిధులు, బహుజన కుల సంఘాల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ముగిసిన కామన్వెల్త్ గేమ్స్ 2026

- 11 రోజుల పాటు సాగిన క్రీడా సంబరం
- స్కాట్లాండ్ లోని గ్లాస్గో వేదికగా పోటీలు
- కేవలం 10 క్రీడా విభాగాల్లో నిర్వాహణ
- 74 దేశాల నుండి పాల్గొన్న క్రీడాకారులు
- ఈసారి సత్తా చాటిన భారత క్రీడాకారులు
- 13 స్వర్ణాలు, 17 రజతాలు, 9 కాంస్యాలు
- పతకాల పట్టికలో భారత్ నాలుగో స్థానం
- 2030లో కామన్వెల్త్ కు భారత్ ఆతిథ్యం
- గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో నిర్వహణ

స్కాట్లాండ్ లోని గ్లాస్గో నగరంలో 11 రోజుల పాటు హోరాహోరీగా సాగిన కామన్వెల్త్ గేమ్స్ 2026 క్రీడలు ముగిశాయి. జూలై 23న ప్రారంభమైన ఈ ప్రతిష్టాత్మక పోటీలు ఆదివారం (ఆగస్టు 3) తెల్లవారుజామున ముగింపు వేడుకలతో ముగిశాయి. ఈసారి గ్లాస్గో నిర్వాహకులు బడ్జెట్ కారణాల వల్ల ఈవెంట్ల సంఖ్యను కుదించి, కేవలం 10 క్రీడా విభాగాల్లో మాత్రమే పోటీలను నిర్వహించారు. అయినప్పటికీ, 74 దేశాలకు చెందిన వేలాది మంది అథ్లెట్లు పాల్గొన్న ఈ క్రీడా



వేడుకల్లో భారత అథ్లెట్లు తమ ప్రతిభతో ఆకట్టుకున్నారు. ప్రతిష్టాత్మక కామన్‌వెల్త్ గేమ్స్ 2026 పాయింట్స్ టేబుల్‌లో టాప్-5లో చోటు దక్కించుకోవడమే లక్ష్యంగా బరిలోకి దిగిన భారత్.. అనుకున్నది సాధించింది. భారత్ తరపున రేసులో నిలిచిన క్రీడాకారులు అద్భుత ప్రదర్శనతో మొత్తం 39 పతకాలను కొల్లగొట్టారు. ఇందులో 13 పసిడి పతకాలు, 17 వెండి పతకాలు, 9 కాంస్య పతకాలు ఉన్నాయి. ఈ అద్భుత ప్రదర్శనతో భారత్ ఓవరాల్ పతకాల పట్టికలో ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్, కెనడాల తర్వాతి స్థానంలో నిలిచి నాలుగో స్థానాన్ని కైవసం చేసుకుంది. గతంలో జరిగిన 2022 బర్మింగ్‌హామ్ కామన్వెల్త్ గేమ్స్‌తో పోలిస్తే ఈసారి పతకాల సంఖ్య తగ్గింది. 2022లో భారత్ 22 స్వర్ణాలు, 16 రజతాలు, 23 కాంస్యాలతో మొత్తం 61 పతకాలు సాధించి పతకాల పట్టికలో నాలుగో స్థానంలో నిలిచింది. అయితే గ్లాస్గో 2026 గేమ్స్‌లో భారత్‌కు పతకాలు తెచ్చిపెట్టే సాంప్రదాయ క్రీడలైన షూటింగ్, రెజ్లింగ్ (కుస్తీ), బ్యాడ్మింటన్, టేబుల్ టెన్నిస్, హాకీలను తొలగించడం పతకాల సంఖ్య తగ్గడానికి ప్రధాన కారణమైంది. అడ్డంకులు ఎదురైనా, లభించిన పరిమిత అవకాశాల్లోనే భారత క్రీడాకారులు చూపిన పట్టుదల ప్రశంసనీయం. ముఖ్యంగా మహిళా అథ్లెట్లు ఎక్కువ సంఖ్యలో స్వర్ణాలు సాధించి సత్తాచాటారు. కామన్వెల్త్ క్రీడలు ముగియడంతో భారత అథ్లెట్లు తమ తర్వాతి లక్ష్యమైన ఏషియన్ గేమ్స్‌పై ఫోకస్ పెట్టారు.

ఇక 2030లో జరిగే కామన్వెల్త్ గేమ్స్‌కు భారత్ ఆతిథ్యం ఇవ్వనుంది. 2030 కామన్వెల్త్ గేమ్స్‌కు అహ్మదాబాద్ ఆతిథ్యం ఇవ్వనుంది. 2010లో ఢిల్లీలో కామన్వెల్త్ గేమ్స్‌కు విజయవంతంగా ఆతిథ్యం ఇచ్చిన భారత్, రెండోసారి ఈ బహుళ క్రీడల మహోత్సవాన్ని నిర్వహించనున్న దేశంగా నిలిచింది. ఆస్ట్రేలియా తర్వాత కామన్వెల్త్ గేమ్స్‌కు రెండుసార్లు ఆతిథ్యం ఇస్తున్న రెండో దేశంగా భారత్ చరిత్ర సృష్టించనుంది. అధికారిక బాధ్యతల బదిలీ కార్యక్రమంలో ఒలింపిక్ స్వర్ణ పతక విజేత నీరజ్ చోప్రా, భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ) అధ్యక్షురాలు పీటీ ఉష, గుజరాత్ ఉప ముఖ్యమంత్రి హర్ష్ సంఘవీ భారత తరపున కామన్వెల్త్ జెండా, బ్యాటన్‌ను స్వీకరించారు. ఈ కార్యక్రమం ముగింపు వేడుకల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. గ్లాస్గోలో బాధ్యతల బదిలీ కార్యక్రమం పూర్తికావడంతో ఇప్పుడు ప్రపంచ క్రీడాభిమానుల దృష్టి 2030 కామన్వెల్త్ గేమ్స్‌పై పడింది. శతాబ్ది సంచికకు ఆతిథ్యం ఇవ్వనున్న అహ్మదాబాద్ ప్రపంచ స్థాయి క్రీడా వేదికగా నిలిచేందుకు ఇప్పటికే సన్నాహాలు ప్రారంభించే అవకాశం ఉంది. 2010 ఢిల్లీ గేమ్స్ తర్వాత మరోసారి భారత్ కామన్వెల్త్ క్రీడలను నిర్వహించనున్న నేపథ్యంలో దేశ క్రీడా రంగంలో కొత్త అధ్యాయానికి నాంది పలికినట్లైంది.

## ప్రజావాణిలో ఇల్లంద సర్పంచ్‌పై వార్డు సభ్యుల ఫిర్యాదు

వర్ధన్నపేట ప్రతినిధి,ఆగస్టు 03, తరంగాలు : వర్ధన్నపేట మండలం ఇల్లంద గ్రామ సర్పంచ్ ఏకపక్ష నిర్ణయాలు, గ్రామపంచాయతీ నిధుల దుర్వినియోగం, పరిపాలనలో అవకతవకలు జరుగుతున్నాయని ఆరోపిస్తూ గ్రామ వార్డు సభ్యులు సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. సర్పంచ్ వార్డు సభ్యుల అభిప్రాయాలను పట్టించుకోవడం లేదని, అధికార పార్టీకి చెందిన వార్డుల్లోనే అభివృద్ధి పనులు చేపడుతున్నారని, మహిళ ఉపసర్పంచ్ అధికారాల్లో ఇతరులు జోక్యం చేసుకుంటున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. అలాగే ఎం.బి. రికార్డుల్లో అవకతవకలు, చేయని పనులకు బిల్లులు పొందినట్లు అనుమానాలు ఉన్నాయని ఆరోపించారు. ఈ అంశాలపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వార్డు సభ్యులు జిల్లా కలెక్టర్‌ను కోరారు.

## కలుషిత ఆహారం తిని 27 మంది విద్యార్థులకు అస్వస్థత

- వర్ధన్నపేట ట్రైబల్ వెల్ఫేర్ బాలికల ఆశ్రమ పాఠశాలలో ఘటన
- విద్యార్థులు పరామర్శించిన వర్ధన్నపేట మండల బీజేపీ అధ్యక్షుడు అడుప రాజు



వర్ధన్నపేట ప్రతినిధి , ఆగస్టు 3, తరంగాలు : వరంగల్ జిల్లా వర్ధన్నపేట పట్టణంలోని ట్రైబల్ వెల్ఫేర్ బాలికల ఆశ్రమ పాఠశాలలో కలుషిత ఆహారం తిని 27 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. విద్యార్థులకు వాంతులు, కడుపునొప్పి తదితర అనారోగ్య లక్షణాలు కనిపించడంతో తీవ్రతను దృష్టిలో ఉంచుకొని వారిని వెంటనే వర్ధన్నపేట ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం వైద్యులు వారికి చికిత్స అందిస్తున్నారు.

విషయం తెలుసుకున్న వర్ధన్నపేట మండల బీజేపీ అధ్యక్షుడు అడుప రాజు ఆసుపత్రికి చేరుకుని బాధిత విద్యార్థులను పరామర్శించారు. అనంతరం వైద్యులతో మాట్లాడి విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు.విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ మెరుగైన వైద్యం అందించాలని ఆయన సూచించారు.ఈ కార్యక్రమంలో బీజేవైఎం నాయకులు పెందుట మహంత్, శ్రీరాముల రాజు, సట్ల అనిల్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ కోసం కష్టపడ్డ కార్యకర్తలకే తొలి ప్రాధాన్యత ఇవ్వాలి



**జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు మహమ్మద్ అయూబ్**

వరంగల్ ప్రతినిధి, ఆగస్టు 3,తరంగాలు : కాంగ్రెస్ పార్టీ కోసం కష్టపడ్డ కార్యకర్తలకే తొలి ప్రాధాన్యత ఇవ్వాలని వరంగల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు మహమ్మద్ అయూబ్ అన్నారు.గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 3వ డివిజన్ కాంగ్రెస్ కమిటీ ఏర్పాటుకు సంబంధించి డివిజన్ అధ్యక్షుడు జన్ను అరుణాకర్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో వరంగల్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మహమ్మద్ అయూబ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ అయూబ్ మాట్లాడుతూ, డివిజన్ కాంగ్రెస్ కమిటీని మొత్తం 20 మంది సభ్యులతో ఏర్పాటు చేయాలని సూచించారు. కమిటీలో కనీసం 6 మంది మహిళలకు అవకాశం కల్పించేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, మహిళలకు సముచిత ప్రాతినిధ్యం ఉండే విధంగా కమిటీని రూపొందించాలని అన్నారు.అదేవిధంగా డివిజన్ కమిటీ ఏర్పాటు ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని, పార్టీ అభివృద్ధి కోసం నిరంతరం కష్టపడిన కార్యకర్తలకు తొలి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ముఖ్యంగా గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి అహర్నిశలు శ్రమించిన నాయకులు, కార్యకర్తలను గుర్తించి వారికి రెండో ప్రాధాన్యత కల్పించాలని తెలిపారు.

కొత్త నాయకత్వానికి అవకాశాలు కల్పిస్తూనే, పార్టీకి ఎన్నో సంవత్సరాలుగా సేవలందించిన సీనియర్ నాయకుల అనుభవాన్ని సమన్వయం చేస్తూ కొత్త--పాత నాయకుల కలయికతో బలమైన డివిజన్ కమిటీని ఏర్పాటు చేయాలని ఆయన పిలుపునిచ్చారు. పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త అంకితభావంతో పనిచేయాలని, ప్రజల మధ్య ఉంటూ కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలను మరింత బలోపేతం చేయాలని సూచించారు.డివిజన్ స్థాయిలో సమర్థవంతమైన కమిటీలు ఏర్పడితే పార్టీ మరింత బలోపేతం అవుతుందని, ప్రజా సమస్యల పరిష్కారంలో కాంగ్రెస్ పార్టీ ముందుండి పోరాడే శక్తిగా నిలుస్తుందని మహమ్మద్ అయూబ్ పేర్కొన్నారు.ఈ సమావేశంలో డివిజన్ అధ్యక్షుడు జన్ను అరుణాకర్, మాజీ కార్పొరేటర్ జన్ను శీభారాణి -- అనిల్ కుమార్, కాంగ్రెస్ నాయకులు బుద్దే పెద్దన్న, జన్ను అభికేశం, జన్ను సుధాకర్, జేసన్, అనిల్, సతీష్, గాదె రాము, అనిల్, కూచన రవి, తదితరులు పాల్గొన్నారు.



# బైక్ చోరీల ముఠా గుట్టురట్టు





- వరంగల్ సీసీఎస్, కేయూసీ పోలీసుల సంయుక్త చర్యలో ఇద్దరి అరెస్ట్
- రూ.25 లక్షల విలువైన 28 ద్విచక్ర వాహనాల స్వాధీనం
- పలు జిల్లాల్లో వరుస చోరీలకు పాల్పడినట్లు దర్యాప్తులో వెల్లడి
- నిందితులను పట్టుకున్న పోలీసు బృందాన్ని అభినందించిన అధికారులు

వరంగల్, ఆగస్టు 3 : వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో వరుసగా జరుగుతున్న ద్విచక్ర వాహనాల చోరీల కేసులను ఛేదించిన సెంట్రల్ క్రైమ్ స్టేషన్ (సీసీఎస్), కాకతీయ విశ్వవిద్యాలయ పోలీస్‌స్టేషన్ (కేయూసీ) పోలీసులు ఇద్దరు నిందితులను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి సుమారు రూ.25 లక్షల విలువైన 28 మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఇటీవల పెరుగుతున్న బైక్ చోరీల నేపథ్యంలో సెంట్రల్ జోన్ డీసీపీ కవిత ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక బృందాలు సాంకేతిక ఆధారాలతో ఈ కేసును ఛేదించాయి. పోలీసులు అరెస్టు చేసిన నిందితులు దొంతుల ప్రశాంత్ కుమార్ (20), దుర్గం సాయి కార్తీక్ (21)గా గుర్తించారు. వీరు మంచిర్యాల జిల్లాకు చెందినవారని, సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో తెలంగాణలోని పలు జిల్లాల్లో ద్విచక్ర వాహనాలను లక్ష్యంగా చేసుకుని వరుస చోరీలకు పాల్పడినట్లు ప్రాథమిక విచారణలో తేలినట్లు పోలీసులు వెల్లడించారు. నిందితుల కదలికలను సాంకేతికంగా విశ్లేషించి వారిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు.

వాహనాల తనిఖీల సమయంలో నిందితులు ప్రయాణిస్తున్న అనుమానాస్పద పల్సర్ మోటార్ సైకిల్‌ను స్వాధీనం చేసుకుని విచారించగా, వారు దాచిపెట్టిన వాహనాల వివరాలు వెల్లడించినట్లు పోలీసులు తెలిపారు. వారి చూపిన మేరకు మునిపల్లి గ్రామ శివారు, ఎలుకతుర్తి సమీప ప్రాంతాల్లో నిర్వహించిన సోదాల్లో మొత్తం 28 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. వాటిలో హోండా షైన్, హీరో స్ప్లెండర్ ప్లస్, హీరో గ్లామర్, హెచ్‌ఎఫ్ డీలక్స్, బజాజ్ పల్సర్, హోండా హార్నెట్ వంటి వివిధ నమూనాల వాహనాలు ఉన్నాయి. దర్యాప్తులో నిందితులు వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఎనిమిది, కరీంనగర్ కమిషనరేట్ పరిధిలో తొమ్మిది, రామగుండం కమిషనరేట్ పరిధిలో మూడు, సిద్దిపేట కమిషనరేట్‌లో రెండు, హైదరాబాద్ కమిషనరేట్‌లో మూడు, రాచకొండ కమిషనరేట్‌లో ఒకటి, భూపాలపల్లి జిల్లాలో రెండు బైక్‌లను చోరీ చేసినట్లు వెలుగులోకి వచ్చింది. ఆయా పోలీస్ స్టేషన్లలో నమోదైన కేసులతో ఈ వాహనాలను అనుసంధానం చేస్తూ తదుపరి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నిందితులపై గతంలో కూడా పలు ఆస్తి నేరాలకు సంబంధించిన కేసులు నమోదైనట్లు విచారణలో వెల్లడైంది. స్వాధీనం చేసుకున్న వాహనాల అసలు యజమానులను గుర్తించి, చట్టపరమైన ప్రక్రియ పూర్తి చేసిన అనంతరం వారికి అప్పగించేందుకు చర్యలు చేపడుతున్నట్లు పోలీసులు పేర్కొన్నారు. ప్రజలు తమ వాహనాలను భద్రంగా నిలిపి అదనపు భద్రతా పరికరాలను వినియోగించాలని, అనుమానాస్పద వ్యక్తులు లేదా వాహనాలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. ఈ కేసును ఛేదించడంలో ప్రతిభ కనబరిచిన సీసీఎస్ ఇన్‌స్పెక్టర్లు ఏ. రాఘవేందర్, ఈ. హరికృష్ణ, కె. రామకృష్ణ, కేయూసీ ఇన్‌స్పెక్టర్ రవికుమార్, ఉప ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరాజు, సిబ్బంది, సమాచార సాంకేతిక విభాగం సభ్యులను వరంగల్ పోలీస్ కమిషనరేట్ అధికారులు అభినందించారు. ఈ మీడియా సమావేశంలో హనుమకొండ, సీసీఎస్ సహాయ పోలీసు కమిషనర్లు నర్సింహారావు, సదయ్య పాల్గొన్నారు.

## అస్వస్థతకు గురైన విద్యార్థినులకు ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు పరామర్శ



వర్ధన్నపేట ప్రతినిధి , ఆగస్టు 3, తరంగాలు :

వర్ధన్నపేట మండల కేంద్రంలోని ఎస్టీ ట్రైబల్ గర్ల్స్ హాస్టల్ విద్యార్థినులు అస్వస్థతకు గురై ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న వర్ధన్నపేట ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు సోమవారం ఆసుపత్రికి వెళ్లి విద్యార్థినులను పరామర్శించారు. వారికి ధైర్యం చెప్పి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థినులు అస్వస్థతకు గురికావడం బాధాకరమన్నారు. వైద్యులు వెంటనే స్పందించి విద్యార్థినులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చికిత్స అందించారని తెలిపారు. విద్యార్థినులు పూర్తిగా కోలుకునే వరకు మెరుగైన వైద్యసేవలు అందించడంతో పాటు వైద్యులు నిరంతరం పర్యవేక్షించాలని ఆసుపత్రి వైద్యాధికారులను ఆదేశించారు.సంఘటనకు గల కారణాలను కలెక్టర్, ఉన్నతాధికారులతో మాట్లాడి తెలుసుకుంటామని, సమస్యలకు పరిష్కారం చూపి భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అవసరమైన చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే తెలిపారు. త్వరలో హాస్టల్‌ను సందర్శించి అక్కడి వసతులను పరిశీలించి, అవసరమైన సౌకర్యాలపై అధికారులతో మాట్లాడి విద్యార్థినులకు అండగా ఉంటానన్నారు. విద్యార్థినులకు ఎలాంటి హాని జరగలేదని, రాత్రి లేదా ఉదయం వరకు పూర్తిగా కోలుకునే అవకాశం ఉందని వైద్యులు తెలిపారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. విద్యార్థినుల తల్లిదండ్రులతో మాట్లాడి వారికి కూడా మనోధైర్యం కల్పించినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా డీసీసీ అధ్యక్షుడు మహమ్మద్ ఆయుబ్, మున్సిపల్ చైర్మన్ పాలకుర్తి సారంగపాణి, సొసైటీ చైర్మన్ కౌడగాని రాజేష్ ఖన్నా, మండల అధ్యక్షుడు పోశాల వెంకన్న గౌడ్ , పట్టణ అధ్యక్షుడు ఈగ దామోదర్, జిల్లా ఉపాధ్యక్షులు ఎద్దు సత్యనారాయణతో పాటు నియోజకవర్గ, మండల, గ్రామ ముఖ్య నాయకులు, కౌన్సిలర్లు, సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.





# ప్రకృతి ఒడిలో.. ఆత్మీయ స్నేహగానం!

- తాటికొండ 'ఖిలా గుట్ట'పై అంబరాన్నంటిన స్నేహితుల దినోత్సవ సంబురాలు
- సర్వాయి పాపన్న చారిత్రక కోటపై ప్రకృతి ఆరాధన, ట్రెక్కింగ్ సందడి



ఘన్‌పూర్ , ఆగస్టు 3,తరంగాలు : హనుమకొండ స్టేషన్ ఘన్‌పూర్ మండలం తాటికొండ గ్రామంలో తాటికొండ ఖిలా గుట్ట లో ఉరుకులు పరుగుల యాంత్రిక జీవన గతికి కాసింత విరామం.. నాలుగు గోడల మధ్య బందీయైన బిజీ లైఫ్‌స్టైల్‌కు వీడ్కోలు చెబుతూ.. చారిత్రక ప్రాభవానికి, ప్రకృతి రమణీయతకు నిలయమైన 'తాటికొండ ఖిలా గుట్ట' ఆత్మీయ స్నేహగానంతో పులకరించింది. స్నేహితుల దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రముఖ వైద్యులు డాక్టర్ నరేందర్ ఆధ్వర్యంలో వివిధ వృత్తుల్లో స్థిరపడిన నిపుణులు,ప్రకృతి ప్రేమికులు కలిసి నిర్వహించిన 'ప్రత్యేక ట్రెక్కింగ్' కార్యక్రమం మధురానుభూతులను పంచింది.



### చారిత్రక సౌరభం.. పచ్చని పల్లె అందాలు

తాటికొండ గుట్ట కేవలం సాధారణ రాళ్ల సమూహం కాదు.. బహుజన వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న నిర్మించిన అద్భుత చారిత్రక 'ఖిలా కోట'కు సజీవ సాక్ష్యం. ఈ కొండపై నాటి రాతి గోడలు, మట్టి కోట ఆనవాళ్లు సందర్శకులకు చరిత్రను గుర్తుచేస్తాయి. గుట్ట పైభాగాన నిలబడి చూస్తే.. నలుదిశలా పచ్చని తివాచీ పరచినట్లుండే పొలాలు, స్వచ్ఛమైన గాలి, ప్రశాంత వాతావరణం ప్రతి ఒక్కరినీ మంత్రముగ్ధులను చేశాయి.

### మరలా వికసించిన బాల్యం.. జ్ఞాపకాల సాగరం

నిత్యం బాధ్యతలతో ఒత్తిడికి గురయ్యే వైద్యులు, వివిధ రంగాల ప్రముఖులు కొండ ఎక్కుతున్నంత సేపు తమ హోదాలను మర్చిపోయి బాల్యంలోకి జారిపోయారు. చెట్టుచేమల ప్రాముఖ్యతను తెలుసుకుంటూ, ప్రకృతి అందాలను ఆస్వాదిస్తూ ముందుకు సాగారు. గుట్టపై ఆహ్లాదకర వాతావరణంలో ఆటపాటలు, చిట్-చాట్, నవ్వులతో గడిపారు. జీవిత అనుభవాలను, పాత జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ స్నేహబంధపు తీపి గురుతులను మనసారా ఆస్వాదించారు.

### మానసిక ఉల్లాసానికే ఈ ట్రెక్కింగ్ డాక్టర్ నరేందర్

నిత్య జీవితంలో ఎంత బిజీగా ఉన్నా, స్నేహితులతో కలిసి ప్రకృతి ఒడిలో గడపడం అద్భుతమైన మానసిక ఉల్లాసాన్నిస్తుంది. నాలుగు గోడల మధ్య గడిపే జీవితాల నుంచి బయటకు వచ్చి, ప్రకృతి అందాలను ఆస్వాదిస్తూ స్నేహబంధాన్ని మరింత బలపరుచుకోవడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశం. అందుకే ప్రతి సంవత్సరానికి 3 నుంచి 4 సార్లు ఇలాంటి ట్రెక్కింగ్ కార్యక్రమాలను నిర్వహిస్తున్నాం.

ఫ్రెండ్‌షిప్ డే రోజున ప్రకృతి మధ్య స్నేహితులంతా ఇలా కలుసుకోవడం జీవితంలో మర్చిపోలేని అనుభూతినిచ్చిందని పాల్గొన్న సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. ఈ ఆత్మీయ సమ్మేళనంలో డాక్టర్ నరేందర్‌తో పాటు డాక్టర్ శారద, డాక్టర్ నిఖిల్, డాక్టర్ దివ్య ధాత్రి,డాక్టర్ గణేష్, డాక్టర్ సునీత, అలాగే మిత్రులు సౌమ్య, శ్రీలత, కవిత,మనీషా, వాణి,శివరంజని,ప్రసన్న, కుందన్, వంశీ, వేణు, రాజేందర్, రాజు, బెన్సన్,తిరుమల్, విష్ణు,సంతోష్ తదితరులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

## నిర్మాణ రంగంలో పడిదల నవీన్ కుమార్‌కు

# 'ఎక్సలెన్స్' కిరీటం





**కార్పొరేట్ సివిల్, ఇంటీరియర్ సొల్యూషన్స్‌లో విశిష్ట సేవలకు గుర్తింపు**

**నాణ్యతకు నజరానా.. నవీన్ కుమార్‌కు ఘన సత్కారం**

**టైమ్స్ ఆఫ్ ఇండియా తెలంగాణ 2026 అవార్డు అందుకున్న పడిదల నవీన్ కుమార్**

**సోనూ సూద్ చేతుల మీదుగా ప్రతిష్టాత్మక పురస్కారం స్వీకరణ**



**మైక్రోసాఫ్ట్, డెల్, విప్రో, టెక్ మహీంద్రా వంటి ప్రముఖ సంస్థల ప్రాజెక్టులతో ప్రత్యేక గుర్తింపు**

**సివిల్ నిర్మాణం నుంచి జాతీయ గుర్తింపు వరకు..**

**నవీన్ కుమార్ నాయకత్వంలో సీహెచ్ఎస్ ప్రాజెక్ట్స్ విజయ ప్రస్థానం**

హైదరాబాద్, ఆగస్టు 3, తరంగాలు ప్రతినిధి : కార్పొరేట్ సివిల్ నిర్మాణం, ప్రీమియం ఇంటీరియర్ సొల్యూషన్స్ రంగాల్లో విశిష్ట సేవలు అందిస్తూ జాతీయ స్థాయిలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటున్న సీహెచ్ఎస్ ప్రాజెక్ట్స్ వ్యవస్థాపకుడు, డైరెక్టర్ పడిదల నవీన్ కుమార్ మరో ప్రతిష్టాత్మక పురస్కారాన్ని సొంతం చేసుకున్నారు.



టైమ్స్ ఆఫ్ ఇండియా తెలంగాణ 2026 ఆధ్వర్యంలో నిర్వహించిన అవార్డుల ప్రదానోత్సవంలో 'ఎక్సలెన్స్ ఇన్ కార్పొరేట్ సివిల్ & ఇంటీరియర్ సొల్యూషన్స్' అవార్డును నవీన్ కుమార్ అందుకున్నారు. తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా సమక్షంలో, సేవా కార్యక్రమాలతో దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిన సినీ నటుడు సోనూ సూద్ చేతుల మీదుగా ఆయన ఈ పురస్కారాన్ని స్వీకరించారు.

ఈ అవార్డు తనకు వ్యక్తిగతంగా ఎంతో గౌరవాన్ని, బాధ్యతను పెంచిందని నవీన్ కుమార్ తెలిపారు. ఈ గుర్తింపును అందించిన టైమ్స్ ఆఫ్ ఇండియా యాజమాన్యానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ పురస్కారం తన వ్యక్తిగత విజయమే కాకుండా, సీహెచ్ఎస్ ప్రాజెక్ట్స్ బృందం, క్లయింట్లు, కుటుంబ సభ్యులు, స్నేహితులు, శ్రేయోభిలాషుల సమిష్టి కృషికి దక్కిన గౌరవమని పేర్కొన్నారు.

### నాణ్యతే నమ్మకానికి ప్రతీక

"ప్రతి ప్రాజెక్ట్ ఒక నిర్మాణం మాత్రమే కాదు... అది నాణ్యతపై నిర్మించబడిన విశ్వాసానికి ప్రతీక" అనే సిద్ధాంతంతో సీహెచ్ఎస్ ప్రాజెక్ట్స్‌ను నవీన్ కుమార్ ముందుకు నడిపిస్తున్నారు. సాంకేతిక నైపుణ్యం, నాణ్యత, సమయపాలన, పారదర్శకత, నైతిక విలువలకు ప్రాధాన్యం ఇస్తూ గత పదేళ్లుగా సంస్థ అనేక ప్రతిష్టాత్మక ప్రాజెక్టులను విజయవంతంగా పూర్తి చేసింది. మైక్రోసాఫ్ట్, డెల్ టెక్నాలజీస్, విప్రో, టెక్ మహీంద్రా, సెయంట్, యూనిసిస్, బ్రాడ్‌రిడ్జ్ వంటి ప్రముఖ సంస్థల కోసం సీహెచ్ఎస్ ప్రాజెక్ట్స్ కీలక పనులను పూర్తి చేసింది. అలాగే మహీంద్రా యూనివర్సిటీ, ఫ్లేమ్ యూనివర్సిటీ వంటి విద్యాసంస్థల్లోనూ ప్రతిష్టాత్మక ప్రాజెక్టులను విజయవంతంగా అమలు చేసింది.

### ఆనంద్ మహీంద్రా ప్రశంసలు

మహీంద్రా యూనివర్సిటీలో చేపట్టిన సివిల్, కోఆర్డినేషన్, ప్రీమియం ఇంటీరియర్ పనుల నాణ్యతకు పారిశ్రామికవేత్త ఆనంద్ మహీంద్రా నుంచి వ్యక్తిగత ప్రశంసలు లభించడం సంస్థ ప్రతిష్టను మరింత పెంచిందని నవీన్ కుమార్ తెలిపారు.

హైదరాబాద్‌తో పాటు బెంగళూరు, పుణే, ముంబై, చెన్నై, నోయిడా తదితర ప్రధాన నగరాల్లో సేవలను విస్తరించిన సీహెచ్ఎస్ ప్రాజెక్ట్స్ ప్రస్తుతం దేశవ్యాప్తంగా విశ్వసనీయ సంస్థగా ఎదుగుతోంది.

### సామాజిక బాధ్యతకు పెద్దపీట

వ్యాపార విజయాలతో పాటు సామాజిక బాధ్యతను కూడా నవీన్ కుమార్ సమానంగా భావిస్తున్నారు. ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు విద్యా సహాయం అందించడంతో పాటు గ్రామీణాభివృద్ధి కార్యక్రమాలకు తనవంతు సహకారం అందిస్తూ సామాజిక సేవలోనూ ముందుంటున్నారు. వ్యాపార వృద్ధితో పాటు సమాజానికి తిరిగి ఇవ్వాలనే ఆలోచనతో ఆయన ముందుకు సాగుతున్నారు.

### వరుసగా ప్రతిష్టాత్మక అవార్డులు

కార్పొరేట్ మౌలిక సదుపాయాల రంగంలో చేసిన విశేష సేవలకు తాజాగా టైమ్స్ ఆఫ్ ఇండియా తెలంగాణ 2026 'ఎక్సలెన్స్ ఇన్ కార్పొరేట్ సివిల్ & ఇంటీరియర్ సొల్యూషన్స్' అవార్డు అందుకున్న నవీన్ కుమార్, అంతకుముందు లిమలేషియా తెలంగాణ అసోసియేషన్ 'బిజినెస్ ఐకాన్ అవార్డు'లిను కూడా అందుకున్నారు.

వరుసగా లభిస్తున్న ఈ పురస్కారాలు పడిదల నవీన్ కుమార్ వ్యాపార నాయకత్వం, నాణ్యతా ప్రమాణాలు, సామాజిక బాధ్యతకు నిదర్శనంగా నిలుస్తున్నాయి. భవిష్యత్తులో మరింత ఉన్నత ప్రమాణాలతో అత్యుత్తమ ప్రాజెక్టులను అందిస్తూ సీహెచ్ఎస్ ప్రాజెక్ట్స్‌ను జాతీయ స్థాయిలో మరింత ఉన్నత స్థానానికి తీసుకెళ్లడమే తన లక్ష్యమని నవీన్ కుమార్ తెలిపారు.

## బీహార్‌లో బిజెపికి అతిపెద్ద షాక్

**బంకీపూర్ అసెంబ్లీలో ప్రశాంత్ కిశోర్ భారీ విజయం**

**30 ఏళ్ల కంచుకోటను బద్దలు కొట్టిన ప్రశాంత్**



పాట్నా,ఆగస్టు 3 బిహార్‌లో సరికొత్త రాజకీయం ఆవిష్కృతం అయ్యింది. అలాగే బిజెపికి అతిపెద్ద షాక్ తగిలింది. బంకీపూర్ శాసనసభ ఉపఎన్నికలో జన్ సురాజ్ పార్టీ అధినేత ప్రశాంత్ కిషోర్ సంచలన విజయం సాధించారు. గత 30 ఏళ్లుగా బిజెపికి కంచుకోటగా ఉన్న ఈ నియోజకవర్గంలో పీకే గెలుపు జెండా ఎగరేశారు. ప్రశాంత్ కిశోర్ తన సమీప బీజేపీ అభ్యర్థి నీరజ్ సిన్హాపై 18,953 ఓట్ల భారీ తేడాతో ఘన విజయం సాధించారు. ఉదయం కౌంటింగ్ మొదలైనప్పటి నుంచీ బీజేపీ నేత నీరజ్ కుమార్ కంటే ముందంజలో ఉన్న ప్రశాంత్ కిశోర్ ఒక్కో రౌండ్ ముగిసేసరికి తన ఆధిక్యాన్ని అంతకంతకూ పెంచుకున్నారు. పీకేకు 63,203 పోలయ్యాయి. అలానే రెండో స్థానంలో నిలిచిన బీజేపీ అభ్యర్థి నీరజ్ కుమార్ కు 44,250, మూడో స్థానంలో నిలిచిన ఆర్జేడీ అభ్యర్థి రేఖ కుమారి 14,085 ఓట్లు సాధించారు. ఈ చరిత్రాత్మక విజయం అనంతరం ప్రశాంత్ కిషోర్ మాట్లాడుతూ.. తన గెలుపు బీజేపీ హైకమాండ్‌కు ఒక బలమైన సందేశమని వ్యాఖ్యానించారు. నేర చరిత్ర కలిగిన వ్యక్తిని బిహార్ ముఖ్యమంత్రిగా చేశారని తీవ్రస్థాయిలో మండిపడిన ఆయన, సామ్రాట్ చౌదరిని వెంటనే సీఎం పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ ఉపఎన్నిక ఫలితం బిహార్ రాజకీయాల్లో సరికొత్త మార్పునకు సంకేతమని ఆయన పేర్కొన్నారు. రాజ్యసభకు ఎన్నికైన బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్.. బంకీపూర్ ఎమ్మెల్యేగా రాజీనామా చేశారు. దీంతో ఆ నియోజకవర్గానికి ఉప ఎన్నిక నిర్వహించారు. బీజేపీ కంచుకోటగా పేరున్న ఈ నియోజకవర్గంలో.. 1995 నుంచి బీజేపీ అభ్యర్థులే విజయం సాధిస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రశాంత్ కిశోర్ అసాధారణ విజయం సాధించడం, బీజేపీ కంచుకోటలో జేఎస్‌పీ జెండా ఎగురవేయడం యావత్ దేశం దృష్టిని ఆకర్షించింది. ప్రశాంత్ విజయంతో.. జేఎస్పీ శ్రేణులు పెద్ద ఎత్తున సంబరాలు చేసుకున్నాయి.